
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5 బుధవారం 21 మే 2025



జ్వాలను అడ్డుకునేదెలా?

హైదరాబాద్‌లో ఇటీవల గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17మంది మృత్యువాతపడ్డారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నా ఆచరణలో కనిపించడంలేదు. జిల్లాలో పలు భవనాలు, మాల్స్‌లో ఫైర్ సేఫ్టీ నిబంధనలేవీ కన్పించడం లేదు. ఇష్టానుసారంగా భవనాలు నిర్మిస్తుండటంతో అగ్గిరాజుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

7



ప్రతిష్ఠాత్మకమైన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎవరిని వరించబోతోందనే అంశం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా అవతరించడం, కాంగ్రెస్‌లో కీలక నేతలున్న జిల్లా కావడంతో ఇక్కడ పార్టీకి సారథ్యం వహించే బాధ్యతలు దక్కించుకునేందుకు కీలక నేతలు ప్రయత్నిస్తున్నారు. రానున్న రోజుల్లో పార్టీ కేంద్రంగానే నిర్ణయాలు ఉంటాయని, ఎమ్మెల్యే అభ్యర్థులను సైతం డీసీసీల ద్వారానే ఎంపికచేస్తామని అధిష్ఠానం సంకేతాలు ఇవ్వడంతోపాటు, పార్టీకి మొదటి నుంచి విధేయతగా ఉంటూ సేవలందిస్తున్న నాయకులకే పదవులిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. దీంతో కీలకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకునే నేత ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



- బలమైన పోటీ దారుగా గుమ్మల
- బీసీ వర్గాల నుంచి రేసులో కైలాష్, దయాకర్
- ఎస్సీలకు కేటాయిస్తే కొండేటికే పదవి

కౌన్ బనేగా డీసీసీ? ప్రెసిడెంట్

రాష్ట్రంలో పెద్ద జిల్లా కావడమేగాక, కాంగ్రెస్‌కు బలమైన ప్రాంతంగా పేరున్న నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి కోసం కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ ముఖ్య నేతల సిఫారసులతో పాటు, పార్టీకి అందించిన సేవలను వారు గుర్తుచేస్తున్నారు. ప్రతీ జిల్లా నుంచి డీసీసీ అధ్యక్ష పదవికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మైనార్టీ వర్గాలకు చెందిన ఒక్కో పేరును చివరి జాబితాలో పరిశీలిస్తున్న అధిష్ఠానం ఆ మేరకు ఆయా వర్గాల నాయకుల పేర్లపై ఆరా తీస్తోంది. ముఖ్య నేతల సిఫారసులను, ఇతర సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత అధ్యక్ష పదవికి నేతను ఎంపిక చేయనున్నారు. డీసీసీ పదవికి ఇప్పటికే పార్టీలో పలు బాధ్యతల్లో ఉన్న గుమ్మల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, పున్నా కైలాష్‌నేత, చనగాని దయాకర్‌గౌడ్, తదితర నాయకులు పోటీపడుతున్నారు. మంత్రి, మాజీ మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకోవడం

బలమైన పోటీదారుగా గుమ్మల

ప్రతిష్ఠాత్మకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవికి ప్రస్తుత నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి బలమైన పోటీదారుగా నిలిచారు. ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చిన మోహన్‌రెడ్డికి జిల్లా వ్యాప్తంగా పార్టీ నేతలందరితో సాన్నిహిత్యం ఉంది. అంతేగాక క్యాడర్‌తో విస్తృత స్థాయి సంబంధాలు ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 2006 నుంచి 2011 వరకు సమర్థంగా పనిచేసిన నాయకుడిగా గుర్తింపు ఉంది. పార్టీ అధికారంలో లేని సంక్షోభ సమయంలోనూ పార్టీని వీడకుండా కొనసాగడమేగాక, కార్యకర్తలు పార్టీ వీడకుండా కాపాడిన వ్యక్తిగా మోహన్‌రెడ్డికి పేరుంది. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండే నేతగా, పార్టీ వ్యవహారాలను, కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించే నాయకుడిగా గుర్తించి డీసీసీ బాధ్యతలివ్వాలనే చర్చ పార్టీ ముఖ్యనేతలు, క్యాడర్‌లో చర్చ సాగుతోంది. జిల్లాకు చెందిన కీలక నేతలు సైతం మోహన్‌రెడ్డికి డీసీసీ బాధ్యతలు ఇప్పించే విషయంలో సానుకూలంగా ఉన్నట్లు క్యాడర్‌లో చర్చ నడుస్తోంది.

ఎస్సీ వర్గానికి కేటాయిస్తే కొండేటికి

డీసీసీ అధ్యక్ష పదవిని ఎస్సీ వర్గానికి కేటాయిస్తే పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యకు పదవి దక్కుతుందనే సంకేతాలున్నాయి. 20 ఏళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు, గత ఎన్నికలకు ముందు నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన నేతగా మల్లయ్యకు గుర్తింపు ఉంది. జడ్పీటీసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రికార్డు సైతం మల్లయ్యకు కలిసొచ్చే అంశం. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేకపోయిన సందర్భంలో రానున్న రోజుల్లో తత్సమాన పదవి ఇస్తామనే హామీని అధిష్ఠాన నాయకులు ఇచ్చారని, ఇప్పటికే కార్పొరేషన్ పదవి బలంగా ఆశిస్తున్న నేపథ్యంలో తాజాగా డీసీసీ అధ్యక్ష పదవికి సైతం ఆయన పేరును పరిశీలించే అవకాశం ఉందనే చర్చ పార్టీలో సాగుతోంది. పార్టీని వీడకుండా అంటిపెట్టుకొని ఉన్న నేతగా మల్లయ్య డీసీసీ పదవికి బలమైన నేతగా చర్చ సాగుతోంది.

బీసీ వర్గాల నుంచి కైలాష్‌నేత, దయాకర్‌గౌడ్

డీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని కోరుతున్న యువ బీసీ నేతలు ఆ పదవి దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న పున్నా కైలాష్‌నేత ఈ పదవిని బలంగా ఆశిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఓయూజేఏసీ నేతగా, విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో కైలాష్‌నేత క్రియాశీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2104, 2018, 2022, 2023 ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యే టిక్కెట్‌కోసం ప్రయత్నించారు. అదేవిధంగా 2024లో భువనగిరి ఎంపీ టిక్కెట్ సైతం ఆశించినా, పార్టీ ఇతర అవకాశాలు కల్పిస్తామని నచ్చజెప్పిందని, డీసీసీ అధ్యక్షపదవి ఇస్తే పార్టీని సమర్థవంతంగా నడిపిస్తానని కైలాష్‌నేత తన వాదనను అధిష్ఠానం ముందుంచారు. అదేవిధంగా మరో బీసీ యువనేత, పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ డీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. ఈయన విద్యార్థి జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేసిన సమయంలో పార్టీలో చేరిన దయాకర్‌గౌడ్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడిగా, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పలు ఆందోళనలు, ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించానని, పార్టీ ప్రతినిధిగా గళాన్ని వినిపించే నేతగా తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని దయాకర్‌గౌడ్ కోరుతున్నారు. మొత్తంగా డీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు కీలక నేతలు పోటీపడుతుండడంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది.



ఇక.. వారికి స్థాన చలనమే

- ఒకే ప్రాంతంలో తిష్టవేసిన పీఏసీఎస్‌ల సీఈవోలకు చెక్
- 30 ఏళ్లుగా చైర్మన్లకు తలనొప్పిగా మారిన కొందరు సీఈవోలు
- జీవో 44 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఈవోలతో పాటు స్టాఫ్ అసిస్టెంట్ల బదిలీలు సైతం

ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) సీఈవోలను ఎట్టకేలకు బదిలీచేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 44ను జారీ చేసింది. దీంతో దశాబ్దాల తరబడి సొసైటీల్లో ఉండి, ఆ సొసైటీలను దెబ్బతీయడమేగాక రైతుల ద్వారా ఎన్నికైనా సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లను లెక్కచేయకుండా పెత్తనం చెలాయిస్తూ తలనొప్పిగా మారిన సీఈవోలు బదిలీ కానున్నారు. దీంతో సొసైటీల్లో ఇబ్బందులు తొలగి అభివృద్ధి పథంలోకి వెళ్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లు ఉన్నాయి. చాలా సొసైటీల్లో 30 ఏళ్లకుపైగా సీఈవోలు తిష్ఠ వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతుల కోసం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు 107 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. చాలా మంది సొసైటీ చైర్మన్లు పలుమార్లు ఎన్నికై విధులు నిర్వహిస్తున్నారు. అయితే పలు చోట్ల సీఈవోలే షాడో చైర్మన్లుగా వ్యవహరిస్తూ చైర్మన్లను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ప్రతీ సొసైటీకి చైర్మన్ ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సీఈవోలు మాత్రం ఉద్యోగ విరమణ చేసేంత వరకు తమను ఏమీ చేయలేరనే ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా సొసైటీల్లో చైర్మన్‌కు, సీఈవో మధ్య పొసగక సమస్యలు జటిలంగా మారి సొసైటీల ప్రతిష్ఠ దెబ్బతినే వరకు దారితీసింది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో బ్యాంకు రూ.2,750కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతూ రూ.3వేల కోట్ల టర్నోవర్‌ను చేరుకునేందుకు పాలకవర్గం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల సీఈవోలతో పాటు స్టాఫ్ అసిస్టెంట్‌ల బదిలీకి నిర్ణయించింది. మూడు నుంచి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని వెంటనే బదిలీ చేయాల్సి ఉండగా, ఏళ్ల తరబడి ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా, బదిలీలకు ప్రభుత్వం జీవో జారీచేసింది.

ఎస్ఎల్ఈసీ మార్గదర్శకాల మేరకు

పీఏసీఎస్‌లలో సీఈవోల బదిలీలను టెస్కాబ్ పర్యవేక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు టెస్కాబ్ అధికారులు

- మిగతా 7వ పేజీలో...

రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖలీల్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, వేదికపై ఖీల్ అహ్మద్

దేవరకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖలీల్ అహ్మద్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న ఆరు గ్యారెంటీలతోపాటు సంక్షేమ పథకాలను బూత్‌స్థాయి నుంచి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐలో పనిచేసినవారు పార్టీలో కీలక పదవుల్లో ఉన్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్, ఖలీల్ అహ్మద్‌ను యువజన కాంగ్రెస్ నాయకులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.ఏ.సిరాజ్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ.యూనుస్, నాయకులు చింతపల్లి వెంకటేశ్వర్లు, ఏకుల అనిత, ముక్కిరాల రాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లగొండకు కేటీఆర్ రాక

నల్లగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం నల్లగొండకు రానున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు నల్లగొండలో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

పెద్దఅడిశర్లపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని జడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరుపట్టిక, విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా ప్రజలకు చేరేలా చూడాలన్నారు. అనంతరం ఇంకుడు గుంతలు, మండల కేంద్రంలోని వన నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రమౌళి, సూపరింటెండెంట్ జాకీర్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ తిరుపతిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవితేజ, తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 18 మంది డిబార్ 7

తల్లి హత్య కేసులో కుమారుడికి జీవితఖైదు 6

చెరువు ఆక్రమణలపై విచారణ

సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం

- మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయిస్తా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జీ.ఎడవల్లి చెరువు అభివృద్ధికి రూ1.3కోట్ల నిధులతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, జీ.ఎడవల్లి చెరువు గత పాలకుల నిర్లక్ష్యానికి గురైందన్నారు. చెరువు అలుగుకు గండిపడి నీరు వృథాగా దిగువకు వెళ్తున్నా పట్టించుకోలేదన్నారు. గ్రామంతోపాటు, చుట్టుపక్క గ్రామాలకు చెందిన రైతుల కోరిక మేరకు నిధులు కేటాయించి, శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల జీ.ఎడవల్లిలో రూ.5కోట్లతో బీటీ నిర్మాణం జరిగిందన్నారు. 84 పేద కుంటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.30లక్షలు మంజూరు చేశామన్నారు. కనగల్ ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో గ్లకోమా సెంటర్ ఏర్పాటుచేశామని, 40 ఏళ్లు పైబడిన వారంత కంటి పరీక్షలు చేయించుకుని చూపును కాపాడుకోవాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగానికి రూ.4వేల కోట్లు కేటాయించి పనులు చేపట్టగా దురదృష్టవశాత్తు సొరంగం పైకప్పు కూలి పనులు నిలిచాయన్నారు. త్వరలో రెండో వైపు నుంచి సొరంగం పనులు చేపట్టి మూడేళ్ల కాలంలో పూర్తి చేయిస్తానన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, చెరువు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, జీ.ఎడవల్లి నుంచి లక్ష్మీదేవిగూడెం, దోరెపల్లి రహదారిలో పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలని అనూప్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, పాల్గొన్నారు.



కనగల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ ఇలా త్రిపాఠి

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బీటీఎస్‌లో నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాల్వను, వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సత్యనారాయణ, అబ్బగోని రమేష్, తదితరులు ఉన్నారు.

మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చు

కట్టంగూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం అయిటిపాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో స్వాబాక్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛశక్తి ఆఫ్ గ్రిడ్ కోఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఒప్పంద పత్రాలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, సుంకరబోయిన నర్సింహ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ నవీన్‌కుమార్

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- ఏపీడీ నవీన్‌కుమార్

కేతేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బంది రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని జిల్లా ఉపాధి హామీ పథకం అదనపు పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు నిర్వహించాల్సిన వివిధ రకాల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో సోషల్ ఆడిట్‌లో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సోషల్ ఆడిట్‌లో నమోదయ్యే సాధారణ సమస్యలు ఎఫ్ఏలు, టీఏల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వివిధ స్థాయిల్లో జరిగే సోషల్ ఆడిట్‌లో సాధారణ సమస్యలు నమోదుకాకుండా చూసుకోవాలన్నారు. 2018 నుంచి మండలానికి సంబంధించి సోషల్ ఆడిట్‌లో దాదాపు 2వేల పైచిలుకు నమోదైన సాధారణ సమస్యలు పెడింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా ఎఫ్ఏలు, టీఏల సహకారం లేక అపరిష్కృతంగానే ఉంటున్నాయన్నారు. ఈ నెల 23న జిల్లా స్థాయిలో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో వాటిని పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాలరావు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏపీవో ఎస్.సురేందర్, ఎంపీవో నాగమణి, పీఆర్ ఏఈ సంపత్‌కుమార్, ఎస్ఆర్పీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



నల్లగొండలో నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. దేశ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, నల్ల బ్యానర్‌తో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక దూకుడుగా వ్యవహరిస్తోందన్నారు. వందేళ్ల క్రితం కార్మిక పోరాటాల ఫలితంగా సాధించుకున్న అనేక చట్టాలను రద్దుచేసి తెచ్చిన కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల తరహాలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస పెన్షన్ రూ.9,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండి.సలీం, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

నాడు భర్త, నేడు భార్య
నేత్రదానంలో అడుగుజాడల్లో



మృతురాలి కంటిపాపలు సేకరిస్తున్న వైద్యుడు, పక్కన నేత్రనిధి ప్రతినిధులు

మిర్యాలగూడటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారం శాంతమ్మ మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. గతంలో శాంతమ్మ భర్త నేత్రాలను సైతం దానం చేయగా ఆయన బాటలోనే ఆమె కళ్లను నేత్రనిధికి అందించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సీనియర్ సభ్యులు, నేత్రనిధి ప్రతినిధి మిట్టపల్లి విజయభాస్కర్ మాట్లాడుతూ నేత్రదానం మహాదానమన్నారు. మరణించిన వారి కళ్లతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి సామా శ్రీనివాస్, మారం శ్రీనివాస్, గుమ్మడవెల్లి ప్రభాకర్, చిన్ని శ్రీనివాస్, చీదళ్ల హరి, గరిణె వెంకటేశ్వర్లు, బచ్చలకూరి రమేష్, ఉప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో తేజ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు వచ్చిన బహుమతులను చూపిస్తున్న తేజ పాఠశాల డైరెక్టర్ సోమిరెడ్డి

కోదాడ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వ్యాసరచనలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన భారతీయ కళా, సాంస్కృతిక, వారసత్వ సంస్థ మార్చిలో పాఠశాల స్థాయి విద్యార్థులకు 'ప్రపంచ వారసత్వ అద్భుతాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించిందన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి సోమ వెంకటశ్లోక, 9వ తరగతికి చెందిన పీ.ప్రసన్ విజేతలుగా నిలిచారన్నారు. వీరు రాసిన అంశాలను యంగ్ ఇంటాక్ త్రైమాసిక పత్రికలో అచ్చువేశారని, విద్యార్థులకు సర్టిఫికెట్, యంగ్ ఇంటాక్ పుస్తకాలు, డైరీలను మంగళవారం బహుమతిగా పంపించారన్నారు.



ఎర్రటి, బంగారు వర్ణంలో ఎక్కువగా కనిపించే ఆకాశాన్ని 'తూరుపు సింధూరపు, మందారపు, అభివర్ణపు బంగారము' అంటూ వర్ణిస్తుంటారు.. అదే ఆకాశం నీలివర్ణంగా మారితే నీలినీలి ఆకాశం అని పాడుకోవాలేమో అనిపించేలా మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కోదాడలో నీలివర్ణంలో ఆకాశం కనువిందు చేసింది.. ● (ఆంధ్రజ్యోతి-కోదాడ)

సమాజ శ్రేయస్సే లక్ష్యం



మార్చి నెలలో సూర్యాపేటలో ఏర్పాటు చేసిన పురాతన నాణేల ప్రదర్శన



- పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న క్రిష్ణకుమార్
- ప్లాస్టిక్ నివారణకు చేతి సంచుల పంపిణీ
- నాలుగు సార్లు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నీస్‌లో స్థానం

సూర్యాపేటకు చెందిన డాక్టర్ పెండెం క్రిష్ణకుమార్ విభిన్నరంగాల్లోనే రాణిస్తూనే పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడు. ఇప్పటికే నాలుగు అంశాల్లో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నాడు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని నివారించేందుకు వస్త్రాలతో చేతిసంచులు తయారుచేయించి పంపిణీ చేస్తున్నాడు. ఆయా సంచులపై సమాజానికి ఉపయోగపడే పలు మాటలను ప్రచురిస్తున్నాడు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

సూర్యాపేటలోని తహసీల్దార్ కార్యాలయం బజారుకు చెందిన క్రిష్ణకుమార్ కొన్నాళ్ల పాటు స్థానికంగానే మెడికల్ ఏజెన్సీని నిర్వహించి అనంతరం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడా మెడికల్ ఏజెన్సీని కొనసాగిస్తున్నాడు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నాడు. రాష్ట్రపతి ద్రౌపతిముర్ము,రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో పాటు ఎందరో ప్రముఖుల చేత ప్రశంసలు అందుకున్నాడు.

విభిన్న వేషధారణలతో..

క్రిష్ణకుమార్‌కు కళారంగమన్నా ఎంతో అభిమానం. భిన్నపాత్రలను పోషిస్తూ ఆకట్టుకుంటున్నాడు. ముఖ్యంగా శ్రీరాముడు, ఆంజనేయుడు, దుర్యోధనుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్వామి వివేకానంద, శబరీ, అబ్దుల్ కలాంతో పాటు తాత్విక, సాంఘికవాది, జాతీయ, అంతర్జాతీయ, స్వాతంత్ర సమరయోధులు, సైంటిస్టులు, అరుదైన స్త్రీ, పురుష పాత్రలతో వేషధారణలు ధరించి వారి పాత్రల్లో నటించి అందరి చేత మన్ననలు పొందాడు.

విద్యార్థులకు చేయూతగా..

సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాల్లోని సుమారు 300ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్‌ను అందజేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు జాతీయ నాయకుల చిత్రపటాలు పాఠశాలలకు అందజేస్తున్నారు. దీంతో పాటు పాఠశాలల గోడలపై వరల్డ్ మ్యాప్‌లు, జాతీయ నాయకుల చిత్రాలను పెయింటింగ్ వేయించాడు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులు అందజేస్తున్నారు.

నేటి తరానికి దేశ చరిత్ర తెలియాలనే...



నేటి తరం యువత, విద్యార్థులకు దేశ చరిత్ర, చరిత్రకారులు చేసిన గొప్ప విషయాలను తెలియచేయాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. భారత దేశం కళలు, కళాకారులకు పుట్టినిల్లు. పౌరాణిక, సాంఘిక వివిధ రంగాల్లో ఎంతో ప్రసిద్ధి. దేశం ప్రపంచ చరిత్రలో నిలబడాలనే ఉద్దేశంతో నాటక రంగంలో ఎక్కువ పాత్రల్లో నటించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సాధించా. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.

- డాక్టర్ పెండెం క్రిష్ణకుమార్

పురాతన నాణేల ప్రదర్శన

క్రిష్ణకుమార్‌కు దేశ విదేశాలకు చెందిన పురాతన నాణేలు, నోట్లను సేకరించడం అలవాటు. 1994నుంచి నేటివరకు వాడుకలో ఉన్న సుమారు 194 దేశాలకు చెందిన పురాతన నాణేలను సేకరించి పలుచోట్ల ప్రదర్శించారు.వీటితో పాటు నాలుగు వేల స్టాంపులను కూడా సేకరించారు.

నాలుగు సార్లు రికార్డులు

క్రిష్ణకుమార్ నాలుగుసార్లు లిమ్కా బుక్ ఆఫ్ గిన్నీస్ రికార్డ్స్, గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లను సొంతం చేసుకున్నాడు. 2009లో 12గంటల్లో 65 పాత్రలు ప్రదర్శించి రికార్డు సాధించారు. 2011లో టైపింగ్‌లో అల్ఫాబెటిక్ ప్రకారం 26 అక్షరాలను నాలుగు సెకన్లలో పూర్తి చేసినందుకు, 2012లో నిమిషం వ్యవధిలో వివిధకంపెనీలకు చెందిన 16 జతల బూట్లను బాక్స్‌లో అమర్చినందుకు, 2013లో నిమిషంలో హగ్ ఇచ్చే పోటీల్లో 79 మందికి హగ్ ఇచ్చి గిన్నీస్ రికార్డు సాధించాడు.



చిన్నారికి చేయూత

● తల్లి దండ్రులను కోల్పోయిన బాలిక పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్



పోస్టాఫీసు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను చిన్నారికి అందజేస్తున్న గ్రామస్థులు

నాంపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామ యువకులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన గౌసియాకు, మిర్యాలగూడకు చెందిన ఖయ్యుంతో వివాహం కాగా వారికి కుమార్తె అయేషా ఉంది. తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో అయేషా అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. పాపస్థితిని తెలుసుకున్న గ్రామ యువకులు చిన్నారి పేరిట ఫిక్స్‌డ్ చేసేందుకు కొంతనగదును సేకరించారు. ఉడుత చిరంజీవి రూ.54,500 ఇవ్వగా, కొంతమంది యువకులు ఇచ్చిన డబ్బులు మొత్తం రూ.62,000 పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను పాప తాతయ్యకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వీరమల్ల బిక్షం, గంగసాని అశోక్, దిండుగాల యాదయ్య, కామల్ల బాబు, ఉడుత నరేష్, జెల్లిపోతుల శ్రీధర్, మాలే వెంకటయ్య, ఎండీ రియాజ్, వీరమల్ల శ్రీను, కొండారెడ్డి, రాములు, మిట్టపల్లి నరేష్, గొర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా...



ఉపేందర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కనగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలకేంద్రానికి చెందిన పలువురు తమ స్నేహితుడికి కష్టకాలంలో అండగా నిలిచారు. ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న రావుల ఉపేందర్‌కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. కిడ్నీ మార్పిడి కోసం రూ.10 లక్షలు అవసరం కాగా విషయం తెలుసుకున్న స్నేహితులు, క్లాస్‌మెంట్స్ అందరూ మంగళవారం ఉపేందర్‌ను కలిసి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.72,500 అందజేశారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆపత్కాలంలో అండగా నిలిచిన యువకులు స్నేహబంధం గొప్పదని చాటిచెప్పారు.

పోలీస్‌శాఖలో అక్రమార్కులపై నజర్

- సూర్యాపేటలో రాష్ట్ర పోలీస్ బృందాల విచారణ
- ఐదేళ్ల నుంచి కేసులపై ప్రత్యేక దృష్టి
- ప్రధానంగా ప్రైవేట్ ఆసుపత్రులపై నమోదైన కేసుల పరిశీలన

సూర్యాపేటక్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖలో జరిగిన, జరుగుతున్న అవినీతిపై రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా గతంలో ఎస్పీగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన అధికారి సమయంలో ఎక్కువగా అవినీతి, అక్రమాలు జరిగాయని, జిల్లాలో అవినీతిని కొందరు వ్యక్తుల సాయంతో ఆ అధికారి వత్తాసు పలికాడని ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో సూర్యాపేట జిల్లాలో పోలీస్‌శాఖలో గతంలో జరిగిన, జరుగుతున్న అవినీతిపై పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అందుకోసం హైదరాబాద్ నుంచి పలువురు ప్రత్యేక పోలీస్‌అధికారులను విచారణ కోసం సూర్యాపేటకు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. సంబంధిత పోలీస్ అధికారులు సూర్యాపేటకు వచ్చి సుమారు ఐదేళ్లుగా సూర్యాపేట పట్టణంతో పాటు రూరల్ సర్కిల్ పరిధిలో జరిగిన పలు ముఖ్యమైన కేసుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

ప్రధానంగా ఆసుపత్రుల కేసులపైనా

సూర్యాపేట పట్టణంలో ఐదేళ్ల నుంచి నమోదైన ప్రత్యేకకేసుల గురించి విచారణ చేస్తున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో రెమ్‌డీసీవర్ ఇంజెక్షన్ల విషయంలో కేసులు నమోదయ్యాయి. అంతేకాకుండా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేయడం, గర్భస్థ శిశువు స్కానింగ్ వివరాలు తెలియచేయడంపై పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులపై కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల విషయంలో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు అప్పటి జిల్లా పోలీస్ అధికారికి దగ్గరిగా ఉండే వారు సంబంధిత కేసుల విషయంలో కలుగజేసుకుని పెద్ద మొత్తంలో కేసులు నమోదైన వారి నుంచి వసూలు చేసి పోలీస్ అధికారులకు ముట్టచెప్పినట్లు సమాచారం. అంతేకాకుండా జిల్లాలో అనేక అక్రమ వ్యాపారాల విషయంలో కూడా పెద్దఎత్తున అవినీతికి కొందరు పోలీస్ అధికారులు పాల్పడ్డారని పట్టణానికి చెందిన కొందరు ఫిర్యాదులుచేశారు. దీంతో అన్ని కేసులకు సంబంధించి ప్రత్యేకంగా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. విచారణలో వాస్తవాలు బహిర్గతమైతే గతంలో సూర్యాపేట పట్టణంలో పనిచేసిన పోలీస్ అధికారులకు ఇబ్బందులు కలిగే అవకాశాలు లేకపోలేదు. అంతేకాకుండా ఇటీవల సూర్యాపేటలో అనుమతులు లేని, అర్హత లేని ఆస్పత్రులు, వైద్యులపై ఐఎంఏ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదుచేశారు. ఆయా కేసులకు సంబంధించి కూడా సదరు వైద్యుల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేసేందుకు మాజీ పోలీస్ అధికారి స్వయంగా సూర్యాపేటకు వచ్చి చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఆపిల్ స్కానింగ్ సెంటర్ వైద్యుడి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసిన విషయంలో ఇప్పటికే డీఎస్పీ, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఇంకా జిల్లా పోలీస్ శాఖలో ముస్ముందు ఏం జరుగుతుందోనని పోలీస్ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

బతుకు పోరాటం

30ఏళ్లుగా ఒకేచోట చెప్పులు కుట్టుకుంటూ జీవనం



నల్లగొండ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో కనిపిస్తున్న పెద్దాయన పేరు బొజ్జ లింగయ్య. నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని మర్రిగూడ ప్రాంతానికి ఆయన వయస్సు 80 ఏళ్లు. ఈ వయస్సులోనూ కులవృత్తి(చెప్పులు కుట్టుకుంటూ)తో జీవనం సాగిస్తున్నాడు. తన గ్రామం నుంచి వచ్చి హైదరాబాద్ రోడ్డు పక్కన వీటీకాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం పక్కన 30 ఏళ్లుగా చెప్పులు కుడుతున్నాడు. తాను ఇక్కడ చెప్పులు కుట్టే పని ప్రారంభినప్పుడు ఈ ప్రాంతంలో ఏమీ ఉండేవి కావని, 30 ఏళ్లలో అనేక మార్పులు వచ్చినట్లు లింగయ్య తెలిపారు. చెప్పులుకుట్టడం ద్వారా వచ్చిన డబ్బుతో నలుగురు ఆడపిల్లలు, అబ్బాయిని పోషించి పెళ్లిళ్లు చేశానని చెప్పారు. కార్పొరేట్ సంస్థలు, పెద్దషాపులు రావడంతో పనికి ఆదరణ తగ్గిందని, ప్రస్తుతం రోజుకు రూ.200 నుంచి రూ.300లు మాత్రమే వస్తాయన్నారు. కొన్నిసార్లు పని ఉండదని సాయంత్రం 6 గంటల వరకు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నాడు.

దాడి కేసులో నిందితులకు జరిమానా

నిడమనూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతుపై దాడి చేసిన కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2016 జూలై 5న అనుముల మండలకేంద్రంలోని ఈశ్వర్‌నగర్‌కు చెందిన చందా శ్రీనివాస్‌రెడ్డి అనే రైతును అదే గ్రామానికి చెందిన కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కూన్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డి పొలం బాట పంచాయితీని మనసులో పెట్టుకొని అకారణంగా దాడి చేసి గాయపర్చారు. బాధితుడు అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా అప్పటి ఎస్‌ఐ వెంకటయ్య నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా మంగళవారం కేసును విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు సీపీ సంజీవ్ కేసు విచారణకు సహకరించారని లైసన్ ఆఫీసర్ అలీ అహ్మద్ తెలిపారు.

తల్లి హత్య కేసులో కుమారుడికి జీవితఖైదు

పెద్దఅడిశర్లపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవితఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాగరాజు మంగళవారం తీర్పు చెప్పారు. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం 2020లో పీఏపల్లి మండలం బాలాజీనగర్‌కు చెందిన మెగావత్ బుజ్జిని ఆమె కుమారుడు మున్నా రోకలిబండతో బాధడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి కొండమల్లేపల్లి సీఐ పరశురాం, గుడిపల్లి ఎస్‌ఐ గోపాల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు మున్నాపై విచారణ జరిపి సరైన సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు జరిపిన అనంతరం మున్నా నేరం చేసినట్లు రుజువుకావడంతో అతడికి జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసులో సాక్షులను కోర్టులో హాజరుపరిచి సకాలంలో ట్రయల్ జరిగేలా చొరవ తీసుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాణి, గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, కోర్టు ఆఫీసర్ నగేష్‌లను దేవరకొండ ఏఎస్పీ మౌనిక, నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవర్ అభినందించారు.

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



వెంకటమ్మ(ఫైల్‌ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ వద్ద నీళ్లు తాగేందుకు వెళ్లి కాలు జారి కాల్వలో గల్లంతైన వృద్ధురాలి మృతి చెందింది. ఆమె మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుడిపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఓర్సు వెంకటమ్మ(65) తన కుమార్తె వరికుప్పల సైదమ్మ గ్రామమైన తిరుమలగిరి గ్రామపంచాయతీలోని వడ్డెరగూడెం గ్రామానికి వెళ్లేందుకు సోమవారం మధ్యాహ్నం ఏకేబీఆర్ కట్టమీదుగా నడుచుకుంటూ వెళ్తోంది. అక్కంపల్లి రిజర్వాయర్ హెడ్‌రెగ్యులేటర్ తలుపుల వద్దకు రాగానే దాహం వేయడంతో అటుగా ఉన్న మెట్లమీదుగా దిగి కాల్వలో నీళ్లు తాగడానికి వెళ్లిం కాలు జారి పడిపోయింది. స్థానికులు గమనించి గుడిపల్లి పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి హుటాహుటినా చేరుకున్నారు. హెడ్‌రెగ్యులేటర్ తలుపుల వద్ద గల మెట్లపై ఆమెకు సంబంధించిన సంచి, చెప్పులు, కర్ర లభించాయి. హైదరాబాద్ జంటనగరాలకు, మిషన్ భగీరథకు పోయే ప్రధాన కాల్వకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని నిలుపుదల చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పొద్దుపోయే వరకు గాలింపు చర్యలు కొనసాగినా ఆమె ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం ఏఎమ్మార్పీ ప్రధాన గేటు వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. వెంకటమ్మ కుమార్తె సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మహిళ మృతి

వలిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పహిల్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మద్ది అరుణమ్మ(58) ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా సోమవారం తెల్లవారుజామున ఆమె పాముకాటుకు గురైంది. వెంటనే గుర్తించి ఆమె చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. దీంతో వారు 108 వాహనంలో భువనగిరిలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందింది. కుమారుడు మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఆమెకు ఇద్దరు కుమారులు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. భర్త గత కొంత కాలం క్రితమే మృతి చెందాడు.

రైలు పట్టాలపై ఓ వ్యక్తి..

యాదగిరిగుట్ట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల పరిధిలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జే కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువగిరి-వంగపల్లి రైల్వేస్టేషన్ మధ్య 240/39-37 దగ్గర హడాప్సర్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి(50) మృతి చెందాడు. ఎడమ ఛాతి కింద పుట్టమచ్చ, ఎరుపుఛాయా కలిగి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పట్టాలు దాటే క్రమంలో ప్రమాదం జరిగినట్లుగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఆనవాళ్లు తెలిసిన వ్యక్తులు 9848222196, 8712568454 సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరువు ఆక్రమణలపై విచారణ



ఎర్రబెల్లిలో చెరువు ఆక్రమణలపై విచారణ చేస్తున్న అధికారులు

నిడమనూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో శనగకుంట చెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేశారు. చెరువుకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించుకున్నారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదుచేశారు. దీంతో కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి చెరువును పరిశీలించి హద్దులను గుర్తించేందుకు సర్వే చేశారు. చెరువుకు వెళ్లే దారితో పాటు అలుగును కూడా ఆక్రమించి సేద్యం చేస్తున్నట్లు విచారణలో అధికారులు గుర్తించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించడంతో పాటు చెరువు ఆక్రమణదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. విచారణలో ఐబీ డీఈ శివరాత్రి శ్రీనివాస్, ఆర్‌ఐ సందీప్, ఐబీ ఏఈ ప్రవీణ్‌రాజ్, సర్వేయర్ విజయ్, రైతులు పాల్గొన్నారు.

మారణాయుధాలతో తిరుగుతున్న మాజీ నేరస్థుడు అరెస్ట్

భువనగిరి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మారణాయుధాలతో తిరుగుతున్న మాజీ నేరస్థుడు ఎండీ బాబాను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం భువనగిరి పెద్దచెరువు కట్ట వద్ద పట్టణ ఎస్‌ఐ కుమార స్వామి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ప్రయాణిస్తున్న బాబాను అదుపులోకి తీసుకొని తనిఖీలు చేపట్టారు. అతడి వద్ద డమ్మీ పిస్తోల్, ఒక గొడ్డలి, కత్తి లభించాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా ఆత్మరక్షణకు, సొంత అవసరాల కోసం అక్రమ వసూళ్లు చేసేందుకు ఆయుధాలను వెంట ఉంచుకున్నట్లు చెప్పాడని తెలిసింది. ఇదిలా ఉండగా గ్యాంగ్‌స్టర్ నయీం ముఠాలో కీలకంగా ఉంటూ పలు హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లు, బెదిరింపులు, అక్రమ వసూళ్ల కేసులలో నిందితుడిగా ఉన్నాడు. పీడీ చట్టంపై జైలుకు వెళ్లివచ్చాడు. పలు కేసులు, కోర్టులలో విచారణ దశలో ఉన్నాయి.

ఈ నేపథ్యంలో బాబా మారణాయులధాలతో సంచరిస్తూ పోలీసులకు పట్టుబడడం స్థానికంగా సంచలనం సృష్టించింది. తాజాగా ఎవరిపైనైనా దాడికి కుట్ర పన్నాడో తెలియాల్సి ఉంది. అయితే బాబా పట్టుబడింది వాస్తవమేనని ఈ మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని భువనగిరి పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 18 మంది డిబార్

నల్లగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 18మంది విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6,140మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,737మంది హాజరయ్యారు. 394మంది గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షల్లో తొమ్మిది మంది డిబారయ్యారు. దేవరకొండలో ముగ్గురు, సూర్యాపేటలో ముగ్గురు, తిరుమలగిరిలో ఒక్కరు, మిర్యాలగూడలో ఒక్కరు, నల్లగొండలో మరొకరు డిబారయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలో 9మంది డిబారయ్యారు. ఈ పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,551 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3,151మంది హాజరు కాగా 391 మంది గైర్హాజరయ్యారు. ఇందులో నల్లగొండలో ఒక్కరు, సూర్యాపేటలో ముగ్గురు, భువనగిరిలో ఇద్దరు, మిర్యాలగూడలో ఒక్కరు, మరో ప్రాంతంలో ఇద్దరిని డిబార్ చేశారు.

మహానాడు కమిటీలో ముత్తినేనికి చోటు


సైదయ్య

కోదాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని, ఏపీలోని కడపలో టీడీపీ మహానాడు జరగనుంది. మూడు రోజుల పాటు ఈ నెల 27,28,29 తేదీల్లో జరుగనున్న, మహానాడు కమిటీలో, కోదాడ పట్టణానికి చెందిన ముత్తినేని సైదేశ్వరరావుకు చోటు దక్కింది. మాజీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్న ఆయనకు రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీలో లభించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమిటీలో చోటు కల్పించడం పట్ల పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి


తూకం వివరాలను అడిగి తెలుసుకుంటున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్

సంస్థాన్ నారాయణపురం మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను చేపట్టాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం సరి చూసి ఎలాంటి అవకతవకలు జరగకుండా కొనుగోలు చేయాలని ఆమె ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన చేసిన రైస్ మిల్లులకు సరఫరా అయ్యేటట్లుగా చూడాలన్నారు. అలాగే రవాణాకు అంతరాయం కలగకుండా అవసరాలకు తగ్గట్టుగా లారీలను పంపించే విధంగా అధికారులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్ రెడ్డి ఎంఆర్ఐ జుబేరుద్దీన్, ఏఆర్ఐ కట్ట పాండు పాల్గొన్నారు

చాడను పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి


చాడ గ్రామంలో తవ్వకాలను పరిశీలిస్తున్న వేదకుమార్, కేపీ రావు, బాబ్జీ

మోటకొండూరు, మే 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ కేపీ రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజిస్ట్ బాబ్జీ అన్నారు. చాడ గ్రామంలోని తొలి చారిత్రక తవ్వకాల ప్రదేశాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తవ్వకాల్లో లభించిన విలువైన సంపద పరిరక్షించడం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. తవ్వకాల్లో బయటపడ్డ సంపదను ప్రజల సందర్శనార్థం కోసం ఏర్పాటు చేసి వాటి ప్రాధాన్యతను విపులంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో తవ్వకాల డైరెక్టర్ పి. నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్స్ మల్లు నాయక్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌కు యత్నించిన వారిపై కేసు

వలిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పేలుడు పదార్థాలతో అక్రమంగా బ్లాస్టింగ్‌కు యత్నించిన వారిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన కొలగాని యాదయ్య తన భూమిలో బండరాళ్లను తొలగించడానికి మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన కంప్రెషర్ యాజమాని బొంత బొబ్బిలితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనేపథ్యంలో సోమవారం పేలుడు పదార్థం బండరాళ్లను తొలగించడానికి సిద్ధమయ్యారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు పోలీసుల సంఘటన స్థలానికి చేరుకొని 23 జిలిటెన్‌స్టిక్స్, 15 డిటోనేటర్లు, ఒక మేగ్గర్ బాక్స్ , 3బండిళ్ల బైండింగ్ కేబుల్స్ 10 మీటర్ల గాడ్ వైరును పట్టివేశారు. సదరు నిందుతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తొమ్మిది ఆవు దూడెల స్వాధీనం

చింతపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఆవు దూడెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం గొడకొండ్ల రిజర్వాయిర్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం తనిఖీ నిర్వహిస్తున్నారు. అమరాబాద్ నుంచి మాల్ మీదుగా వెళ్తున్న రెండు గూడ్స్ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది కోడెదూడెలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాటిని గోశాలకు తరలించి బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

వలిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఏదుళ్లాగూడెం మదిర గ్రామం చైతన్యపురికి చెందిన ఈడబోయిన అశోక్ చెందిన రెండు గేదేల తప్పించుకొని ఆ గ్రామ శివారులో ఉన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు తాకి విద్యుత్‌ఘాతంలో మృతి చెందాయి. వాటి విలువ సుమారు 2 లక్షల రూపాయలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకొని బాధితునికి నష్టపరిహారం చెల్లించాలని రైతు ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీశైలం సొరంగమార్గం పూర్తిచేయాలి

దేవరకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చందంపేట మండలం గనెనర్లపల్లిలో మంగళవారం నిర్వహించిన సీపీఐ 15వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించి రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దేవరకొండ, మునుగోడు నియోజకవర్గంలో ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయన్నారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ కమీషన్ల కోసం కాళేశ్వరానికి నిధులు కేటాయించారే తప్పా శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో గుట్టలపై ఉన్న గ్రామాలకు లిఫ్ట్ పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. మహాసభలో చందంపేట మండల సీపీఐ సహాయ కార్యదర్శి వెంగలయ్య, మారెడ్డి కృష్ణారెడ్డి, అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, షైనొద్దిన్, ఉప్పునూతల వెంకటయ్య, పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్, దేవిలాల్ పాల్గొన్నారు.

జ్వాలను అడ్డుకునేదెలా?



- అగ్ని ప్రమాదం జరిగితే అడ్డు కట్టపడేనా
- పలు భవనాలు, మాల్స్‌లో కన్పించని ఫైర్ సేఫ్టీ
- ఇష్టానుసారం భవనాలు నిర్మాణం

అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నా ఆచరణలో కనిపించడంలేదు. హైదరాబాద్‌లో ఇటీవల గుల్జార్‌హౌస్ చౌరస్తాలో జరిగిన అగ్ని ప్రమాదంలో 17మంది మృత్యువాత పడ్డారు. ఏ మాత్రం అగ్గిరాజుకున్న ప్రమాదంలో పెద్దగా మారుతుంది. మృత్యుజ్వాలగా మారక ముందే అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చు.

\- ఆంధ్రజ్యోతి సూర్యాపేటటౌన్

సూర్యాపేట జిల్లాకేంద్రంలో భవనాల నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు అక్రమంగా నిర్మాణాలు జరగడంతో పాటు కనీసం ఫైర్ సెఫ్టీ ప్రమాణాలు సైతం పాటించడం లేదు. భవనాల్లో ఏ మాత్రం అగ్ని వ్యాపించినా వాటిని ఆర్పేసే యంత్రాలు సైతం భవనాల్లో ఉండడంలేదు. దీనికి తోడు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించడకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఇటీవల అనుమతులకు మించి భవనాన్ని నిర్మించారు. భవనం నిర్మాణం దాదాపుగా పూర్తయిన తర్వాత అధికారులకు తెలియగా కేవలం భవన యజమానికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ భవనానికి రోడ్డు కొద్దిగా ఉండడంతో ఏ మాత్రం ప్రమాదం జరిగినా భారీ నష్టం వాటిల్లే అవకాశముంది. అదేవిధంగా కుడకుడ ప్రాంతంలో అక్రమంగా భవన నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రెసిడెన్షియల్ భవనాలకు 18మీటర్ల కన్నా ఎక్కువ నిర్మిస్తే ఫైర్‌సేఫ్టీ అనుమతులు తీసుకోవాలి. కమర్షియల్ భవనాలకు 15మీటర్ల కన్నా ఎక్కువ నిర్మాణాలకు ఫైర్‌సేఫ్టీ అనుమతులు తీసుకోవాలి ప్రస్తుతం అది ఎక్కడా జరగడం లేదు. జిల్లాకేంద్రంలో అక్రమంగా ఐదు నెలల్లో సుమారు 30 వరకు నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కొన్నింటికి మాత్రమే నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారనే ఆరోణలు ఉన్నాయి. .

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన ఉండాలి. ముఖ్యంగా ఏసీలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి సర్వీసింగ్ చేయించాలి. లూజ్ కనెక్షన్‌లు లేకుండా విద్యుత్ తీగలను మార్చాలి. వంట చేసిన తర్వాత విధిగా గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేయాలి. భవననిర్మాణ యాజమానులు తప్పకుండా ఫైర్‌స్టేఫ్టీ అనుమతులు తీసుకోవాలి.

\- జానయ్య, ఎస్ఎఫ్‌వో సూర్యాపేట.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అనుమతులు లేకుండ నిర్మించిన భవనాలకు నోటీసులు అందించాం. ప్రతి ఒక్క గృహ యజమానులు తప్పకుండ ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలి.

\- బి. శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్.

అగ్ని రాజుకుంటే బుగ్గే

జిల్లాకేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లు మాత్రమే కాకుండా అనేక కార్యాలయాలు ఉన్నాయి. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులను ఇరుకు భవనాల్లో అరకొర వసతులతో ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేట నుంచి విజయవాడకు వెళ్లే జాతీయ రహదారి సుమారు 22కిలోమీటర్ల వరకు వ్యాపించి ఉంది. ఈ రహదారిపై వెంట సుమారు 180 నుంచి 210 దాబాలు, హోటళ్లు ఉంటాయి. వీటిలో ఫైర్‌సేఫ్టీ ఉన్న హోటళ్లు కేవలం 10 లోపే ఉన్నాయి. జిల్లాకేంద్రంలో పెద్దపెద్ద మాల్స్ సుమారుగా 15 వరకు ఉంటాయి. వీటిలో ఫైర్‌సేఫ్టీ మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఫంక్షన్‌హాల్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫైర్‌సేఫ్టీ కనిపించడం లేదు. చాలామంది ఫైర్‌సేఫ్టీకి సంబందించిన లైసెన్సులు సైతం తీసుకోవడంలేదు. గత నెల ఓ ప్రైవేట్ బ్యాంకు ఏసీ వైర్ల షాట్ సర్క్యూట్‌తో బ్యాంకులో మంటలు వచ్చాయి. అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. జిల్లాకేంద్రంతో పాటు నియోజకవర్గ పరిధిలో గడ్డివాములు, గుడిసెలు ఇలా ఇతర కారణాలతో ఐదు నెలల్లో 50కి పైగా అగ్ని ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో రూ.కోటి 30లక్షల ఆస్తినష్టం జరగకుండా కాపాడారు.

అప్రమత్తతే ఆయుధం..

అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతే ఆయుధమని అధికారులు సూచిస్తున్నారు. నిత్య జీవితంలో మనం ఉపయోగించే నిప్పు పట్ల కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పెద్దపెద్ద ప్రమాదాలు తలెత్తకుండా నివారించవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

\- మిర్యాలగూడ

కాల్చిన సిగరెట్, బీడి, అగ్గిపుల్లలు ఆర్పకుండా అజాగ్రత్తగా పారవేయకూడదు. ▸▸ ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలను ఉపయోగిస్తే మంచిది. ▸▸ అగ్గిపెట్టెలు, టపాకాయలు, లైటర్లు ఇతర మండే వస్తువులను చిన్నపిల్లలకు అందుబాటులో ఉంచవద్దు. ▸▸ టపాకాయలు కాల్చే సమయంలో నైలాన్, పాలిస్టర్ దుస్తులు ధరించవద్దు. ▸▸ అగ్రిపమాదం జరిగితే ఆర్పటానికి ఇంట్లో నీరు నిల్వ చేసుకోవాలి. ▸▸ సెలవులపై బయట కు వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి. ▸▸ వంటిల్లో కింది, పైభాగాల్లో బాగా వెలుతురుఉండేలా చూడాలి. ▸▸ ఐఎస్ఐ మార్కు గ్యాస్ ట్యూబ్‌లనే వాడాలి ▸▸ ఎల్‌పీజీ గ్యాస్ వాడకం పూర్తి కాగానే రెగ్యులేటర్ వాల్వును ఆపివేయాలి. ▸▸ గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే ఇంట్లోని ఎలక్ట్రికల్ స్విచ్‌లను ఆన్, ఆఫ్ చేయకూడదు. ▸▸ తాత్కాలిక పందిర్లు వేసేటప్పుడు పెండాల్సు ఎత్తు మూడు మీటర్ల కంటే తక్కువ వుండకుండా చూడాలి. ▸▸ పందిళ్ల చుట్టూ 4.5 మీటర్ల కాళీ స్థలం ఉండేలా చూడాలి. ▸▸ గ్రామాల్లో ఇళ్లకు 60 అడుగుల దూరం ఉండేటట్లు గడ్డివాములు వేసుకోవాలి


నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైన బంగారు ఆభరణాల దుకాణం

మాల్స్, ఆస్పత్రుల నిర్మాణాల్లో పాటించాల్సిన ఫైర్ నిబంధనలు

▸▸ హస్పిటల్స్, పరిశ్రమలు, అపార్ట్‌మెంట్ మల్టీప్లెక్స్‌లు ఆసుపత్రుల బిల్డింగ్స్ పైకప్పును ఆర్‌సిసి లేక కాంక్రీట్ స్లాబ్‌ను మాత్రమే వాడాలి. ▸▸ ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అమర్చుకోవాలి. ▸▸ సెల్లార్లలో ఆటోమేటిక్ స్పింకర్లు ఉపయోగించాలి. ▸▸ అగ్నిమాపక పరికరాలను అమర్చుకోవాలి. ▸▸ చెత్తా చెదారం పోగుకాకుండా భవనాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ▸▸ ఎలక్ట్రిక్ షాట్ సర్క్యూట్ జరిగినప్పుడు అగ్ని ప్రమాదం సంభవించకుండా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను అమర్చుకోవాలి. ▸▸ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు లిఫ్ట్ మార్గంలో కాకుండా మెట్ల మార్గాన్ని, ర్యాంప్‌లను ఉపయోగించాలి. పరిశ్రమలలో విద్యుత్ ఉపకరణాల పనితీరును తరచుగా పర్యవేక్షిస్తుండాలి చమురు గ్యాస్‌లీక్‌లను సమర్థవంతగా అరికట్టాలి.

అగ్ని పమాదాలు సంభవిస్తే ఈ నెంబర్లకు ఫోన్ చేయాలి

నల్లగొండ	8712699319, 8712699318
మిర్యాలగూడ	8712699321, 8712699320
దేవరకొండ	8712699323, 8712699322
నకిరేకల్	8712699325, 8712699324
హాలియా	8712699327, 8712699326
సూర్యాపేట	8712699329, 8712699328



జాగ్రత్తగా ఉండాలి

అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెరగాలి. సామాజి భద్రతపై నిర్లక్ష్యం కూడదు. ముఖ్యంగా పిల్లలను నిప్పుకు దూరంగా వుండేలా చూడాలి. నివాస ప్రాంతాల చుట్టూ చెత్తచెదారం లేకుండా చూడాలి. అగ్ని ప్రమాదం సంభవించినట్లయితే వెంటనే 101కు డయల్ చేసి సమాచారం అందించాలి.

● ఎస్. యాదగిరి, స్టేషన్‌ఫైర్ ఆఫీసర్, మిర్యాలగూడ.

ఇక.. వారికి స్థాన చలనమే

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డీసీసీబీ, సొసైటీల్లో బదిలీల ప్రక్రియపై దృష్టి సారించారు. స్టేట్ లెవల్ ఎన్‌పవర్‌మెంట్ కమిటీ (ఎస్ఎల్ఈసీ) మార్గదర్శకాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 107 సొసైటీలకు చెందిన సీఈవోలను, స్టాఫ్ అసిస్టెంట్‌లను ఎక్కడి నుంచి ఎక్కడికైనా బదిలీ చేసే వీలుంది. ఇప్పటి వరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు బ్రాంచ్‌లలో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేపట్టారు. సొసైటీల్లో మాత్రం సీఈవోల బదిలీలపై దృష్టి సారించలేదు. ఏళ్ల కొద్దీ సొసైటీల్లో సీఈవోలు కొనసాగుతూ వచ్చారు. కొన్ని నెలల క్రితం సొసైటీల పాలకవర్గాలు సీఈవోలను తొలగించాలని తీర్మానాలు చేసి డీసీఈవోలతో పాటు డీసీసీబీ సీఈవోకు, టెస్కాబ్‌కు సైతం వాటిని పంపినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో చైర్మన్‌లు, డైరెక్టర్లు పదవుల్లో ఉన్నా మాట ఖాతరు చేయని ఉద్యోగి, రైతులను ఎలా లెక్కలోకి తీసుకుంటారని ఆవేద చెందుతూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యాక జిల్లా కేంద్రంలో జరిగిన మొదటి సమావేశంలోనే సీఈవోల బదిలీల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలుమార్లు బదిలీ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు అధికారులు బదిలీలకు జీవో 44ను జారీ చేశారు.

త్వరలో డీఎల్ఈఎస్ సమావేశం

రాష్ట్ర ప్రభుత్వం సీఈవోలను, స్టాఫ్ అసిస్టెంట్‌లను బదిలీ చేయడానికి నిర్ణయించి జీవో జారీ చేయడంతో ఎస్ఎల్ఈసీ సమావేశం హైదరాబాద్‌లో రెండు, మూడు రోజుల్లో నిర్వహించనున్నారు. ఎస్ఎల్ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డీఎల్ఈసీ సమావేశాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తారు. గతంలో డిస్ట్రిక్ లెవల్ ఎంపార్డ్ కమిటీ(డీఎల్ఈఎస్) ఏనాడు భేటీ అయిన సందర్భం లేదు. ఈ కమిటీలో డీసీసీబీ చైర్మన్‌తో పాటు డీసీసీబీ సీఈవో, డీసీవో, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ఉంటారు. వాస్తవానికి ఈ కమిటీ ఎప్పటికప్పుడూ సొసైటీల్లో చైర్మన్లు, సీఈవోలకు ఇబ్బందులు వచ్చినప్పుడు సమన్వయపర్చడం, అవసరమైతే సీఈవోను బదిలీ చేయడం వంటివి చేయాలి. ఏళ్లుగా సీఈవోల బదిలీల విషయంలో టెస్కాబ్ నిర్ణయం తీసుకోకపోవడం, డీఎల్ఈఎస్ సమావేశాలు నిర్వహించకపోవడంతో ఇంతకాలం సీఈవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఎట్టకేలకు బదిలీల జీవో జారీ కావడంతో డీఎల్ఈఎస్ భేటీ అయి సొసైటీల పరిస్థితులను అంచనా వేసి దీర్ఘకాలికంగా తిష్ఠవేసిన సీఈవోలకు స్థానచలనం కల్పించనున్నారు.

సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు



దీర్ఘకాలికంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సీఈవోలను బదిలీ చేయాలని పాలకవర్గం విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో జీవో 44ను జారీ చేసినందుకు కృతజ్ఞతలు. అదేవిధంగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకార వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు. ఎస్ఎల్ఈసీ మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఉమ్మడి జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. అందుకు నాలుగైదు రోజులలోనే కమిటీని కూడా ఏర్పాటు చేస్తాం. తమ పాలకవర్గం ఆధ్వర్యంలో రూ.3వేల కోట్ల టర్నోవర్‌ను త్వరలో చేరుకుంటాం. ఈ నేపథ్యంలో సొసైటీలకు మరింత బలం చేకూర్చేలా జీవో నెంబర్ 44 జారీ కావడంతో బదిలీలకు మార్గం సుగమమైంది.

\-కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన

యాదగిరిగుట్ట మే 20 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం మంగళవారం శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో అంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

రేపు హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి సందర్భంగా అంజనేయ స్వామి జయంతి మహోత్సవాలు రేపు (గురువారం) ఉదయం 9గంటలకు కొండపైన విష్ణుపుష్కరిణిలో గల ఆంజనేయ స్వామి వారి ఆలయం, పాతగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో అష్టోత్తర శతమన్యసూక్త పారాయణాలతో అభిషేకం, లక్ష తమలపాకులతో సహస్రనామార్చన, మహానివేదన కార్యాక్రమాలు నిర్వహించినట్లు ఈవో తెలిపారు. రూ.516టికెట్‌తో విష్ణుపుష్కరిణి చెంత ఆలయంలో లక్ష తమలపాకుల అర్చనలో పాల్గొనాలని కోరారు.

హిమాన్షు ప్రత్యేక పూజలు

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మనమడు, మాజీమంత్రి కేటీఆర్ కుమారుడు కల్వకుంట్ల హిమాన్షు జన్మదినం సందర్భంగా ఆలయంలో స్వయంభువులను దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులు వేద మం డపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట మాజీ ప్రభు త్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డంమీద రవీందర్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని మంగళవారం వేదపండితులు కనుల పండువగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారుఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ హుండీ ఆదాయం రూ. 7 లక్షలు

దామరచర్ల, మే 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలో కొలువై ఉన్న బంగారు మైసమ్మతల్లి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన జాతర సందర్భంగా రూ.7,06,392 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ ధీరావత్ దస్రునాయక్ తెలిపారు

. మంగళవారం మిర్యాలగూడ డివిజన్ పరిశీలకులు పి.ఏడుకొండలు పర్యవేక్షణలో ఆలయ హుండీలను లెక్కించగా రూ.5,41,646, మూడు రోజుల టికెట్ల ద్వారా రూ.1,64,746 వచ్చినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్దన్‌నాయక్, మాజీ చైర్మన్ పాచ్యునాయక్, మాజీ చైర్మన్ బాషానాయక్, మాజీ ఎంపీటీసీ నెహ్రూనాయక్, కల్లేపల్లి పంచాయతీ సెక్రటరీ పి.విజయ్, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవిందరెడ్డి, నరేష్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య మిత్రులకు డీపీవో క్యాడర్ కల్పించాలన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సైదులు, మల్లయ్య, వేణు, వినయ్ సంకోజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

నాంపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నరసింహ అన్నారు. మంగళవారం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వడ్లకొండ మల్లయ్య, కుందారపు లక్ష్మయ్య, మేకల మంగమ్మ, నాంపల్లి గణేష్, ప్రధాన కార్యదర్శులుగా చల్లమల్ల కాంతరెడ్డి, పొలగోని శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శులుగా రమావత్ అనూష, నేతల్ల సత్యనారాయణ, సుంకరి శంకర్, కర్నాటి సాంబశివ, కొరివి హరికుమార్‌ను ఎన్నుకున్నారు.

ఫార్మర్ ఐడీకార్డులు పొందాలి



కాసనగోడులో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈవో బాలరాజు

కేతేపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): రైతు గుర్తింపుకార్డు కోసం రైతులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. పురుషోత్తం సూచించారు. మండలంలోని కాసనగోడు, భీమారం గ్రామాల్లోని రైతు వేదికల్లో ఏఈవోలు మంగళవారం నిర్వహించిన ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు పొందడానికి రైతులు ఫార్మర్ ఐడీ పొందాలన్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి డిజిటల్ సైన్‌తో పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు తమ ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకు అయిన ఫోన్ నెంబర్‌తో తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకుని 11 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. ఏఈవోలు బాలరాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

మర్రిగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని మండల విద్యాశాఖ అధికారి బిట్టు శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయ వృత్యంతర ప్రాథమిక శిక్షణలో భాగంగా ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు మర్రిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. పిల్లలు గణిత నైపుణ్యంలో ప్రావీణ్యత సాధించే విధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, లచ్చిరామ్‌నాయక్, రవికాంత్, నాగేంద్ర కరీం, అయితరాజు నాగయ్య, బిచ్చ నాయక్, చంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు ఆస్కారం లేదు



వెలిమినేడులో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి

చిట్యాలరూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): వెలిమినేడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో వెలిమినేడులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్‌లో మంగళవారం మాట్లాడారు. కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని, దాదాపు పూర్తికావొచ్చాయని ఇప్పుడు వెలిమినేడులో కొనుగోలులో అవకతవకలతో రైతులకు నష్టం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేసిన వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. 80శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయి రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయన్నారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యాన్ని నాలుగు రోజుల్లో కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లు ఆపిన ధాన్యాన్ని దిగుమతులు చేసుకునేలా వారితో చర్చించి సమస్యను పరిష్కరిస్తున్నా మన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమస్యను పరిష్కరిస్తున్నా మన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో రైతులకు మేలు జరిగేలా ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, కొంపెల్లి వెంకట్‌రెడ్డి, సామిడి మోహన్‌రెడ్డి, నారగోని దుర్గయ్య, సుర్కంటి సత్తిరెడ్డి, మేడి కృష్ణ, అందె రాములు, టేకుల అంజిరెడ్డి, అంతటి నర్సింహ, చిర్రగోని శ్రీశైలం, ఏనుగు పద్మారెడ్డి, దేశబోయిన మల్లేష్, గోలి గణేష్, మామిడి శ్రీరాములు, అంతటి రాజు, గోలి మహేష్ పాల్గొన్నారు.

వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

మునుగోడు, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రుల యజమానుల ఒత్తిళ్లను తలొగ్గిన ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గూరి నర్సింహ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గ్రామీణ ప్రాంత ఆర్ఎంపీలతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఆర్ఎంపీలపై దాడులకు కార్పొరేట్ ఆస్పత్రుల యజమానుల ఒత్తిళ్లే ప్రధాన కారణమన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు బొమ్మరబోయిన లాలయ్య, మాజీ జడ్పీటీసీ లింగయ్య, యాదయ్య, దుబ్బ వెంకన్న, ఎండీ. జానిమియా, వెంకన్న, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి నాగపడిగ బహూకరణ



నాగ పడగ అందజేస్తున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

కనగల్, మే 20.(ఆంధ్రజ్యోతి): దర్వేశిపురం స్టేజీ వద్దగల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చైతన్య దంపతులు మంగళవారం వెండి నాగపడుగ బహూకరించారు. అంతకుముందు వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చీదెటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులుకు సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఉపేందర్‌రెడ్డి, నకిరేకంటి ఆంజనేయులు అర్చకులు శ్రవణ్‌కుమాచార్యులు, ఫణి, ఉమామహేశ్వర్ తదితరులున్నారు.

నియామకం

మునుగోడు, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత మునుగోడు మండల అధ్యక్షుడిగా మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి శ్రీశైలం, మండల కార్యదర్శిగా పందుల సాయి నియమితులయ్యారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య మంగళవారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీపతి రామ్‌రెడ్డి, షరీఫ్, సుంకర జంగయ్య, వీరమల్ల అశోక్, పందుల రాములు, సత్తయ్య, రాజు, అడమయ్య తదితరులు పాల్గొన్నారు.

వారికి ఆత్మీయ భరోసా అందలే

● ఎంపిక చేసిన గ్రామంలో భూమిలేని కూలీలందరికీ అందని వైనం ● జువ్విగూడెంలో ఆరుగురికి జమ కాని డబ్బులు



అలుగుబెల్లి రాములమ్మకు అందజేసిన ఆత్మీయభరోసా మంజూరు పత్రం

నార్కట్‌పల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి లేని కూలీలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మీయ భరోసా అందరికీ అందడంలేదు. తొలి విడత మండలంలోని ఒక్క గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి ప్రకటించిన కొత్త సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిచేకూరడం ద్వారా ప్రభుత్వం తమ సంకల్పానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలోని జువ్విగూడెం గ్రామాన్ని ఎంపిక చేసి జనవరి 26న గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో మొత్తం రైతుభరోసా కింద 360 మంది, 165 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు, 217మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, 42 మంది ఆత్మీయ భరోసా లబ్ధిదారులను గుర్తించారు. వారికి అదే రోజు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంజూరు పత్రాలు కూడా అందజేశారు.

తమకూ తెలియదంటున్న అధికారులు

ఆత్మీయ భరోసా కింద ఎంపికైన లబ్ధిదారులు ఉపాధి హామీ జాబ్‌కార్డు పొంది కనీసం 20 రోజుల పనిదినాలకు తగ్గకుండా హాజరు కావాలనే నిబంధన పెట్టారు. ఈ పథకం గ్రామంలో 42 మందిని గుర్తించగా పరిశీలన అనంతరం 40 మంది లబ్ధిదారుల పేర్లను డీఆర్‌డీఏ అధికారులు అప్‌లోడ్ చేశారు. వారిలో 37 మందిని మాత్రమే తుది జాబితాలో లబ్ధిదారులుగా గుర్తించారు. ఇలా గుర్తించిన వీరికి రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రెండు పర్యాయాల్లో మొత్తం రూ.12 వేలు వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. కానీ జువ్విగూడెంలో ఆత్మీయ భరోసా కోసం ఎంపిక చేసిన 37మందిలో అలుగుబెల్లి రాములమ్మ, రాజపాక లక్ష్మమ్మ, రాజపాక బుచ్చమ్మ, చింత రాములమ్మ, కోనేటి కృష్ణవేణి, పిల్లల సుశీలకు నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ఈ విషయమై అధికారులను అడిగితే తమకూ తెలియదని అధికారులు చెప్పడం గమనార్హం.

డబ్బులు జమ అయ్యేలా చూడాలి



నాకు భర్త లేడు. జానెడు భూమి కూడా లేదు. ఉపాధి పనులు చేసుకుంటూ పింఛన్‌పై ఆధారపడి బతుకుతున్నా. భూమి లేని పేద రైతులకు ఆత్మీయ భరోసా కింద గుర్తించి నాకు మంజూరు పత్రం ఇచ్చారు. సంవత్సరానికి రూ.12 వేలు బ్యాంకు ఖాతాలో వేస్తారని చెప్పారు. మొదట రూ.6వేలు వస్తాయన్నారు. నాకు ఇండియన్ పోస్టల్ బ్యాంకులో ఖాతా ఉంది. ఉపాధి కూలీ డబ్బులు కూడా అందులోనే పడుతున్నాయి. కానీ ఆత్మీయ భరోసా డబ్బులు పడలేదు. అసలు ఎందుకు డబ్బులు పడలేదో ఎవరూ సరిగ్గా చెప్పడం లేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

● అలుగుబెల్లి రాములమ్మ, ఆత్మీయ భరోసా లబ్ధిదారు. జువ్విగూడెం గ్రామం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జువ్విగూడెంలో కొందరు లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా కింద డబ్బులు వారి ఖాతాలో జమకాలేదని తెలిసింది. అసలు డబ్బులు ఎందుకు పడటం లేదో తెలుసుకోవాల్సి ఉంది. లబ్ధిదారుల జాబితా పంపిన ఉపాధి హామీ సిబ్బంది ద్వారా కారణం తెలుసుకుంటాం. ఆత్మీయ భరోసా పథకం పొందటానికి బాధిత లబ్ధిదారులకు అర్హత ఉంటే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారందరి ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకుంటాం.

● కత్తురోజు ఉమేశ్‌చారి, ఎంపీడీవో

నూతన లేబర్‌కోడ్స్ రద్దు చేయాలి



కట్టంగూరులో సీఐటీయూ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల, మే20, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కార్పొరేట్ కంపెనీల కోసమే కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్యక్రమంలో అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, జడల నర్సింహ, బాకీ అండాలు, రుద్రవరం నర్సింహ్మా, దుర్గేష్, పాల వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: కొత్త లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో మం డల కేంద్రంలో ర్యాలీ నిర్వహి ంచారు. కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు, ఆశావర్కర్, జీపీ కార్మికులు, కవిత, లలిత, సునీత, కవిత, విజయలక్ష్మి, అరుణ, సైదమ్మ, మరియమ్మ, ఎల్లయ్య, సులోచన, రా ములమ్మ, రామస్వామి, ఈరమ్మ, లక్ష్మణ్, వెంకటయ్య, స్వామి, సాయిలు, మంగి, జగతయ్య, బాల్కోటి, రవితేజ పాల్గొన్నారు.

మునుగోడు: కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మునుగోడులోని బీఆర్. అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు నిరసన తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ మా ట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, డీవై ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మిర్యాల భరత్, రైతు సంఘం మండల కార్యదర్శి వేముల లింగస్వామి, జీపీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు లింగయ్య, విజయ్, ఎర్ర అరుణ, రాజు, పెద్దమ్మ, దుర్గయ్య, పావని, సరిత, సంపూర్ణ, లలిత పాల్గొన్నారు.

కనగల్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్ చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి కానుగు లింగస్వామి డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, సీఐటీయూ పిలుపు మేరకు మంగళవారం కనగల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నెలుగుందరాశి లింగయ్య, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మా, బిక్షం, దీనారాణి, స్వర్ణ, సైదమ్మ, జీవనజ్యోతి, వెంకన్న ఉన్నారు.

కట్టంగూరు: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కట్టంగూరులో మంగళవారం సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, పెంజర్ల సైదులు, పొడిచేటి సులోచన, లింగయ్య, కత్తుల శంకర్, యాదయ్య, వెంకటమ్మ, ధనలక్ష్మి, రేణుక ఉన్నారు.



చిట్యాలలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలు నాటాలి

చండూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో హరితహారం కింద ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలు నాటాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కస్తాల గ్రామంలో నర్సరీలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి నర్సరీలో ఇళ్లు, రైతులకు, ప్రభుత్వ స్థలాల్లో పెంచేవిధంగా మూడు రకాల మొక్కలు అందజేయాలన్నారు. వర్షాకాలంలో ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలకు తగ్గకుండా నాటే విధంగా ఎస్టిమేషన్ వేసుకోవాలన్నారు. ఈ నెల చివరిలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున త్వరిత గతిన ఉపాధి సిబ్బందికి రూ.300లు కూలి వచ్చే విధంగా ఎస్టిమేషన్ వేయాలన్నారు. అందుకు సంబంధించిన గుంతలను ఉపాధిహామీ కూలీలతో తీయించాలని సూచించారు. మొక్కల పెంపకం, నాటడంపై అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో యాదగిరి, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం పుల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దు

మునుగోడు రూరల్: నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని డీఆర్‌డీఏపీడీ వై.శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జమస్తాన్‌పల్లి గ్రామంలో వన మహోత్సవంపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకంపై నర్సరీని మెయింటెన్ చేసే విధానం నర్సరీలో పెంచాల్సిన మొక్కలు, వాటిని నాటేందుకు స్థలాలు గుర్తించాలన్నారు. గ్రామాలలో పెన్షన్లకు సంబంధించి వేలి ముద్రలు పడని వారికి మాత్రమే పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ ఇవ్వాలన్నారు. గ్రామంలో ఉండని వారికి ఇవ్వకూడదన్నారు. మంచానికి పరిమితం అయిన వారికి ఎంపీడీవో అనుమతితో కార్యదర్శులు పెన్షన్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో మేకల విజయభాస్కర్, ఎంపీఓ కె.స్వరూప రాణి, ఇన్‌చార్జి ఏపీవో ఇండ్ల నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గట్టుప్పల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతపేట గ్రామంలో ఉన్న నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. గతంలో నిరుపేదలకు ఇచ్చిన భూమిలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. గతంలో అంతపేట గ్రామంలో నిరుపేదల ఇళ్ల స్థలాలకు సర్వేనెంబర్ 6/ఉలో పట్టాలు ఇచ్చారని తమ భూమి వద్దకు లబ్ధిదారులు వెళ్తే అధికారులు అడ్డగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 1999 సంవత్సరంలో అంతంపేట గ్రామంలో ఇళ్లు లేని నిరుపేద ప్రజలకు ఆనాటి ప్రభుత్వం గుర్తించి 150 మందికి పట్టా సర్టిఫికెట్ ఇచ్చిందని గుర్తుచేశారు. నాటి ప్రభుత్వం తమ గ్రామంలో గుడిసెలు వేసుకుంటే అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి మర్చిపోయిందన్నారు. నిరుపేదలకు పట్టాలు ఇచ్చి, ఆ స్థలంలో మౌలిక వసతులు లేకపోవడంతో ఇళ్లు నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్నాటి సుధాకర్, రాచమల్ల వెంకటరెడ్డి, తెలుసూరి సైదులు, సురిగి యాదయ్య, ఐతరాజు కలమ్మ, చొప్పరి లక్ష్మమ్మ, మాదగోని కోటమ్మ, సురిగి బక్కయ్య, చొప్పరి లక్ష్మయ్య, సురిగి సైదులు, సత్తమ్మ నరసింహ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కట్టంగూరు, కనగల్ మండలాల్లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో స్వాబాక్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛశక్తి ఆఫ్ గ్రిడ్ కోఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్లను ప్రారంభించారు. స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేశారు. అదే విధంగా కనగల్ మండలంలోని జీడవల్లి ప్రాజెక్ట్ చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.




కనగల్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి





అయిటిపాములలో సమావేశంలో పాల్గొన్న మహిళలు, చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ నిర్మాత, అలుపెరుగని పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ. సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ, పలు కాలనీల్లో మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నన్నూరి వెంకట రమణారెడ్డి, శంకరయ్య, రాము, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పరామర్శ



మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్

మునుగోడు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెదిరె మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పటాన్ చెరువు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి. ఆదర్శ్‌రెడ్డి వేర్వేరుగా పూలమాలవేసి నివాళులర్పించారు. మంగళవారం మండలంలోని కొంపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు వెదిరె మెగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజేందర్‌రెడ్డిలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి మృతి బాధాకరమన్నారు. వారి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భవనపల్లి సైదులు, మధుర బోయిన యాదయ్య, శ్రీరామ్, జీడిమడ్ల యాదయ్య తదితరులు ఉన్నారు.

రైతులకు అనుకూలంగా దారి మరమ్మతులు

తిప్పర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): రైతులకు అనుగుణంగా గ్రామాల్లోని మట్టిరోడ్లకు మరమ్మతులు చేస్తున్నట్లు తిప్పర్తి మాజీ ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య అన్నారు. మంగళవారం తిప్పలమ్మగూడెం గ్రామం నుంచి మారకమ్మబండ రోడ్డు, శిలార్‌మియాగూడెం గ్రామ శివారు వరకు అదేవిధంగా కన్నెకల్ ఎక్స్ రోడ్డు నుంచి చెరువుపల్లి గ్రామానికి మట్టిరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ బద్దం సుదీర్, నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, సోమరాజు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



తిప్పలమ్మగూడెం వద్ద మట్టిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

జ్వాలను అడ్డుకునేదెలా?

హైదరాబాద్‌లో ఇటీవల గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17మంది మృత్యువాతపడ్డారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నా ఆచరణలో కనిపించడంలేదు. జిల్లాలో పలు భవనాలు, మాల్స్‌లో ఫైర్ సేఫ్టీ నిబంధనలేవీ కన్పించడం లేదు. ఇష్టానుసారంగా భవనాలు నిర్మిస్తుండటంతో అగ్గిరాజుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. 7



ప్రతిష్ఠాత్మకమైన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎవరిని వరించబోతోందనే అంశం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా అవతరించడం, కాంగ్రెస్‌లో కీలక నేతలున్న జిల్లా కావడంతో ఇక్కడ పార్టీకి సారథ్యం వహించే బాధ్యతలు దక్కించుకునేందుకు కీలక నేతలు ప్రయత్నిస్తున్నారు. రానున్న రోజుల్లో పార్టీ కేంద్రంగానే నిర్ణయాలు ఉంటాయని, ఎమ్మెల్యే అభ్యర్థులను సైతం డీసీసీల ద్వారానే ఎంపికచేస్తామని అధిష్ఠానం సంకేతాలు ఇవ్వడంతోపాటు, పార్టీకి మొదటి నుంచి విధేయతగా ఉంటూ సేవలందిస్తున్న నాయకులకే పదవులిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. దీంతో కీలకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకునే నేత ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

గుమ్ముల | కైలాష్‌నేత | కొండేటి | దయాకర్

- బలమైన పోటీ దారుగా గుమ్ముల
- బీసీ వర్గాల నుంచి రేసులో కైలాష్, దయాకర్
- ఎస్సీలకు కేటాయిస్తే కొండేటికే పదవి

కౌన్ బనేగా డీసీసీ? ప్రెసిడెంట్

రాష్ట్రంలో పెద్ద జిల్లా కావడమేగాక, కాంగ్రెస్‌కు బలమైన ప్రాంతంగా పేరున్న నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి కోసం కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ ముఖ్య నేతల సిఫారసులతో పాటు, పార్టీకి అందించిన సేవలను వారు గుర్తుచేస్తున్నారు. ప్రతీ జిల్లా నుంచి డీసీసీ అధ్యక్ష పదవికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మైనార్టీ వర్గాలకు చెందిన ఒక్కో పేరును చివరి జాబితాలో పరిశీలిస్తున్న అధిష్ఠానం ఆ మేరకు ఆయా వర్గాల నాయకుల పేర్లపై ఆరా తీస్తోంది. ముఖ్య నేతల సిఫారసులను, ఇతర సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత అధ్యక్ష పదవికి నేతను ఎంపిక చేయనున్నారు. డీసీసీ పదవికి ఇప్పటికే పార్టీలో పలు బాధ్యతల్లో ఉన్న గుమ్ముల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, పున్నా కైలాష్‌నేత, చనగాని దయాకర్‌గౌడ్, తదితర నాయకులు పోటీపడుతున్నారు. మంత్రి, మాజీ మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకోవడం

బలమైన పోటీదారుగా గుమ్ముల

ప్రతిష్ఠాత్మకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవికి ప్రస్తుత నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి బలమైన పోటీదారుగా నిలిచారు. ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చిన మోహన్‌రెడ్డికి జిల్లా వ్యాప్తంగా పార్టీ నేతలందరితో సాన్నిహిత్యం ఉంది. అంతేగాక క్యాడర్‌తో విస్తృత స్థాయి సంబంధాలు ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 2006 నుంచి 2011 వరకు సమర్థంగా పనిచేసిన నాయకుడిగా గుర్తింపు ఉంది. పార్టీ అధికారంలో లేని సంక్షోభ సమయంలోనూ పార్టీని వీడకుండా కొనసాగడమేగాక, కార్యకర్తలు పార్టీ వీడకుండా కాపాడిన వ్యక్తిగా మోహన్‌రెడ్డికి పేరుంది. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండే నేతగా, పార్టీ వ్యవహారాలను, కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించే నాయకుడిగా గుర్తించి డీసీసీ బాధ్యతలివ్వాలనే చర్చ పార్టీ ముఖ్యనేతలు, క్యాడర్‌లో చర్చ సాగుతోంది. జిల్లాకు చెందిన కీలక నేతలు సైతం మోహన్‌రెడ్డికి డీసీసీ బాధ్యతలు ఇప్పించే విషయంలో సానుకూలంగా ఉన్నట్లు క్యాడర్‌లో చర్చ నడుస్తోంది.

ఎస్సీ వర్గానికి కేటాయిస్తే కొండేటికి

డీసీసీ అధ్యక్ష పదవిని ఎస్సీ వర్గానికి కేటాయిస్తే పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యకు పదవి దక్కుతుందనే సంకేతాలున్నాయి. 20 ఏళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు, గత ఎన్నికలకు ముందు నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన నేతగా మల్లయ్యకు గుర్తింపు ఉంది. జడ్పీటీసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రికార్డు సైతం మల్లయ్యకు కలిసొచ్చే అంశం. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేకపోయిన సందర్భంలో రానున్న రోజుల్లో తత్సమాన పదవి ఇస్తామనే హామీని అధిష్ఠాన నాయకులు ఇచ్చారని, ఇప్పటికే కార్పొరేషన్ పదవి బలంగా ఆశిస్తున్న నేపథ్యంలో తాజాగా డీసీసీ అధ్యక్ష పదవికి సైతం ఆయన పేరును పరిశీలించే అవకాశం ఉందనే చర్చ పార్టీలో సాగుతోంది. పార్టీని వీడకుండా అంటిపెట్టుకొని ఉన్న నేతగా మల్లయ్య డీసీసీ పదవికి బలమైన నేతగా చర్చ సాగుతోంది.

బీసీ వర్గాల నుంచి కైలాష్‌నేత, దయాకర్‌గౌడ్

డీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని కోరుతున్న యువ బీసీ నేతలు ఆ పదవి దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న పున్నా కైలాష్‌నేత ఈ పదవిని బలంగా ఆశిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఓయూజేఏసీ నేతగా, విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో కైలాష్‌నేత క్రియాశీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2104, 2018, 2022, 2023 ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యే టిక్కెట్‌కోసం ప్రయత్నించారు. అదేవిధంగా 2024లో భువనగిరి ఎంపీ టిక్కెట్ సైతం ఆశించినా, పార్టీ ఇతర అవకాశాలు కల్పిస్తామని నచ్చజెప్పిందని, డీసీసీ అధ్యక్షపదవి ఇస్తే పార్టీని సమర్థవంతంగా నడిపిస్తానని కైలాష్‌నేత తన వాదనను అధిష్ఠానం ముందుంచారు. అదేవిధంగా మరో బీసీ యువనేత, పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ డీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. ఈయన విద్యార్థి జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేసిన సమయంలో పార్టీలో చేరిన దయాకర్‌గౌడ్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడిగా, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పలు ఆందోళనలు, ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించానని, పార్టీ ప్రతినిధిగా గళాన్ని వినిపించే నేతగా తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని దయాకర్‌గౌడ్ కోరుతున్నారు. మొత్తంగా డీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు కీలక నేతలు పోటీ పడుతుండడంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది.



ఇక.. వారికి స్థాన చలనమే

- ఒకే ప్రాంతంలో తిష్టవేసిన పీఏసీఎస్‌ల సీఈవోలకు చెక్
- 30 ఏళ్లుగా చైర్మన్లకు తలనొప్పిగా మారిన కొందరు సీఈవోలు
- జీవో 44 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఈవోలతో పాటు స్టాఫ్ అసిస్టెంట్ల బదిలీలు సైతం

ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి తిష్ఠవేసిన ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) సీఈవోలను ఎట్టకేలకు బదిలీచేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 44ను జారీ చేసింది. దీంతో దశాబ్దాల తరబడి సొసైటీల్లో ఉండి, ఆ సొసైటీలను దెబ్బతీయడమేగాక రైతుల ద్వారా ఎన్నికైనా సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లను లెక్కచేయకుండా పెత్తనం చెలాయిస్తూ తలనొప్పిగా మారిన సీఈవోలు బదిలీ కానున్నారు. దీంతో సొసైటీల్లో ఇబ్బందులు తొలగి అభివృద్ధి పథంలోకి వెళ్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లు ఉన్నాయి. చాలా సొసైటీల్లో 30 ఏళ్లకుపైగా సీఈవోలు తిష్ఠ వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతుల కోసం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు 107 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. చాలా మంది సొసైటీ చైర్మన్లు పలుమార్లు ఎన్నికై విధులు నిర్వహిస్తున్నారు. అయితే పలు చోట్ల సీఈవోలే షాడో చైర్మన్లుగా వ్యవహరిస్తూ చైర్మన్లను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ప్రతీ సొసైటీకి చైర్మన్ ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సీఈవోలు మాత్రం ఉద్యోగ విరమణ చేసేంత వరకు తమను ఏమీ చేయలేరనే ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా సొసైటీల్లో చైర్మన్‌కు, సీఈవో మధ్య పొసగక సమస్యలు జటిలంగా మారి సొసైటీల ప్రతిష్ఠ దెబ్బతినే వరకు దారితీసింది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి నేతృత్వంలో బ్యాంకు రూ.2,750కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతూ రూ.3వేల కోట్ల టర్నోవర్‌ను చేరుకునేందుకు పాలకవర్గం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల సీఈవోలతో పాటు స్టాఫ్ అసిస్టెంట్‌ల బదిలీకి నిర్ణయించింది. మూడు నుంచి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని వెంటనే బదిలీ చేయాల్సి ఉండగా, ఏళ్ల తరబడి ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా, బదిలీలకు ప్రభుత్వం జీవో జారీచేసింది.

ఎస్‌ఎల్ఈసీ మార్గదర్శకాల మేరకు

పీఏసీఎస్‌లలో సీఈవోల బదిలీలను టెస్కాబ్ పర్యవేక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు టెస్కాబ్ అధికారులు

- మిగతా 7వ పేజీలో...

రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖలీల్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, వేదికపై ఖీల్ అహ్మద్

దేవరకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖలీల్ అహ్మద్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న ఆరు గ్యారెంటీలతోపాటు సంక్షేమ పథకాలను బూత్‌స్థాయి నుంచి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐలో పనిచేసినవారు పార్టీలో కీలక పదవుల్లో ఉన్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్, ఖలీల్ అహ్మద్‌ను యువజన కాంగ్రెస్ నాయకులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎంఏ.సిరాజ్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు ఎండి.యూనుస్, నాయకులు చింతపల్లి వెంకటేశ్వర్లు, ఏకుల అనిత, ముక్కిరాల రాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లగొండకు కేటీఆర్ రాక

నల్లగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం నల్లగొండకు రానున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు నల్లగొండలో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

పెద్దఅడిశర్లపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని జడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరుపట్టిక, విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా ప్రజలకు చేరేలా చూడాలన్నారు. అనంతరం ఇంకుడు గుంతలు, మండల కేంద్రంలోని వన నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రమౌళి, సూపరింటెండెంట్ జాకీర్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ తిరుపతిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవితేజ, తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 18 మంది డిబార్ 7
తల్లి హత్య కేసులో కుమారుడికి జీవితఖైదు 6
చెరువు ఆక్రమణలపై విచారణ

సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం

- మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయిస్తా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కనగల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జీ.ఎడవల్లి చెరువు అభివృద్ధికి రూ1.3కోట్ల నిధులతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, జీ.ఎడవల్లి చెరువు గత పాలకుల నిర్లక్ష్యానికి గురైందన్నారు. చెరువు అలుగుకు గండిపడి నీరు వృథాగా దిగువకు వెళ్తున్నా పట్టించుకోలేదన్నారు. గ్రామంతోపాటు, చుట్టుపక్క గ్రామాలకు చెందిన రైతుల కోరిక మేరకు నిధులు కేటాయించి, శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల జీ.ఎడవల్లిలో రూ.5కోట్లతో బీటీ నిర్మాణం జరిగిందన్నారు. 84 పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.30లక్షలు మంజూరు చేశామన్నారు. కనగల్ ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో గ్లకోమా సెంటర్ ఏర్పాటుచేశామని, 40 ఏళ్లు పైబడిన వారంత కంటి పరీక్షలు చేయించుకుని చూపును కాపాడుకోవాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగానికి రూ.4వేల కోట్లు కేటాయించి పనులు చేపట్టగా దురదృష్టవశాత్తు సొరంగం పైకప్పు కూలి పనులు నిలిచాయన్నారు. త్వరలో రెండో వైపు నుంచి సొరంగం పనులు చేపట్టి మూడేళ్ల కాలంలో పూర్తి చేయిస్తానన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, చెరువు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, జీ.ఎడవల్లి నుంచి లక్ష్మీదేవిగూడెం, దోరెపల్లి రహదారిలో పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలని అనూప్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బీటీఎస్‌లో నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాల్వను, వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సత్యనారాయణ, అబ్బగోని రమేష్, తదితరులు ఉన్నారు.

మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చు

కట్టంగూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం అయిటిపాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో స్వాబాక్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛశక్తి ఆఫ్ గ్రిడ్ కోఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఒప్పంద పత్రాలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, సుంకరబోయిన నర్సింహ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ నవీన్‌కుమార్

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- ఏపీడీ నవీన్‌కుమార్

కేతేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బంది రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని జిల్లా ఉపాధి హామీ పథకం అదనపు పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు నిర్వహించాల్సిన వివిధ రకాల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో సోషల్ ఆడిట్‌లో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సోషల్ ఆడిట్‌లో నమోదయ్యే సాధారణ సమస్యలు ఎఫ్ఏలు, టీఏల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వివిధ స్థాయిల్లో జరిగే సోషల్ ఆడిట్‌లో సాధారణ సమస్యలు నమోదుకాకుండా చూసుకోవాలన్నారు. 2018 నుంచి మండలానికి సంబంధించి సోషల్ ఆడిట్‌లో దాదాపు 2వేల పైచిలుకు నమోదైన సాధారణ సమస్యలు పెడింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా ఎఫ్ఏలు, టీఏల సహకారం లేక అపరిష్కృతంగానే ఉంటున్నాయన్నారు. ఈ నెల 23న జిల్లా స్థాయిలో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో వాటిని పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాలరావు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏపీవో ఎస్.సురేందర్, ఎంపీవో నాగమణి, పీఆర్ ఏఈ సంపత్‌కుమార్, ఎస్ఆర్పీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



నల్లగొండలో నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి


నల్లగొండ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. దేశ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, నల్ల బ్యానర్‌తో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక దూకుడుగా వ్యవహరిస్తోందన్నారు. వందేళ్ల క్రితం కార్మిక పోరాటాల ఫలితంగా సాధించుకున్న అనేక చట్టాలను రద్దుచేసి తెచ్చిన కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల తరహాలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస పెన్షన్ రూ.9,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండి.సలీం, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహిషాసురమర్దిని అమ్మవారి జాతర

అడవిదేవులపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోనిమహిషాసురమర్దిని అమ్మవారి జాతర కొనసాగుతుంది.మంగళవారం 20న పుట్ట బంగారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా ఆయా మండలాల నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆయా జిల్లాల నుంచి అనేక మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

వేములపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): వేములపల్లి పీఏసీఎస్ కేంద్రంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఈవో కిశోర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 30 కిలోల బస్తా రూ.2138, జనుము 40 కిలోల బ్యాగ్ రూ.2,51, గ్రోమోర్, క్రిబ్కో డీఏపీ బస్తా రూ.1,350, యూరియా రూ.266, జిప్సం రూ.300 విక్రయిస్తున్నట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



నిర్మించినా.. నిరుపయోగం



సీతారామపురం- బంగారిగడ్డ మధ్య రహదారి కంటే ఎత్తుగా ఉన్న బ్రిడ్జి

- సీతారాంపురం-బంగారుగడ్డ కాలనీ ప్రజల కోసం నాలాపై బ్రిడ్జి నిర్మాణం
- రోడ్డుకు ఎత్తుగా నిర్మించడంతో వృథాగా మారిన వైనం
- సరిచేయాలని స్థానికుల విజ్ఞప్తి

(మిర్యాలగూడ టౌన్ - ఆంధ్రజ్యోతి)
రెండు కాలనీల మధ్య దూరాన్ని తగ్గించి రాకపోకల పెంచాలనే లక్ష్యంతో రూ.లక్షలు ఖర్చు చేసి మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపుర-బంగారుగడ్డ కాలనీల మధ్య ఉన్న ప్రధాన నాలాపై బ్రిడ్జి నిర్మించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తికి ఈ బ్రిడ్జి ఇరు కాలనీలను దగ్గర చేయలేకపోతోం ది. అందుకు కారణం తప్పుడు అంచనాలతో బ్రిడ్జిని నిర్మాణం చేపట్టడమే. బ్రిడ్జి ఎత్తుగా నిర్మించగా ఇరు కాలనీలను కలిపే రహదారిని ఏర్పాటు చేసేందుకు అదనపు నిధులు అవసరమయ్యాయి. దీంతో పనులనుు పక్కకు పెట్టగా బ్రిడ్జి నిరుపయోగంగా మారింది.

వేర్వేరుగానే కాలనీలు..

పట్టణంలోని సీతారాంపురం చివర 29, 43వార్డులను కలుపుతూ నిర్మించిన ఈ చిన్నపాటి వంతెన నుంచి నల్లగొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈజీ మార్గం. ఇక బంగారుగడ్డ వాసులు పట్టణంలోకి రావాలంటే ఈ బ్రిడ్జి దూరాన్ని తగ్గిస్తుంది. ఊరంతా తిరిగిరాకుండా మార్కెట్, రైతుబజా ర్, బస్టాండ్, మునిసిపల్ కార్యాలయాలకు వెళ్లేందు కు సులభతరంగా ఉంటుంది. అందుకే రూ. 20 లక్షల వ్యయంతో 2022 సంవత్సరంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో వారధిని ఎత్తుగా నిర్మించారు. అయితే అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు బ్రిడ్జికి ఇరువైపులా మూడడుగుల మేర ఎత్తుగా రోడ్డు నిర్మించాల్సి ఉంది.

త్వరగా పూర్తిచేయాలి

రెండేళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జిపై రాకపోకలు సాగిం చేలా అధికారులు పనులు చేపట్టాలని బంగారుగడ్డ, సీతారాంపురం కాలనీవాసులు కోరుతున్నారు. వారధి పై నుంచి రహదారిని కలిపితే పట్టణంలోని పలు కాలనీల మధ్య దూర భారం తగ్గుతుందంటున్నా రు. బ్రిడ్జి నిరుపయోగంగా మారడంతో ఆకతాయిలకు అడ్డగా మారిందని, రాత్రివేళల్లో బ్రిడ్జిపై మద్యం సేవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



సీతారాంపురం - బంగారుగడ్డ మధ్యలో నాలాపై నిర్మించిన వంతెన నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంతెనది. ఎత్తు ఎక్కువగా ఉంటడంతో రహదారి నిర్మాణానికి అదనపు నిధులు అవసరమై నిర్మాణం ఆగినట్లు తెలిసింది. రహదారి నిర్మాణానికి అవసరమైన అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే రహదారి నిర్మాణం చేపడతాం.

-మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్

మిర్యాలగూడ సబ్‌స్టేషన్లకు కొత్త ఫోన్ నెంబర్లు	
రూరల్ ఏఈ అమర్‌సింగ్	8712469401
బి. అన్నారం సబ్‌స్టేషన్	8712469423
అవంతీపురం సబ్‌స్టేషన్	8712469424
తడకమళ్ల సబ్‌స్టేషన్	8712469425
కొత్తగూడెం సబ్‌స్టేషన్	8712469426
వీటీపాలెం సబ్‌స్టేషన్	8712469427
ఊట్లపల్లి సబ్‌స్టేషన్	8712469428

విద్యుత్ శాఖలో ఫోన్ నెంబర్ల మార్పు	
డీఈఈ మిర్యాలగూడ	8712469394
ఏడీఈ హాలియాతి	8712469398
ఏఈ హాలియా	8712469407
ఏఈ నిడమనూరు	871246940
ఏఈ పెద్దవూర	8712469402
ఏఈ నాగార్జునసాగర్	8712469408

ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలి

మిర్యాలగూడ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదలకు ఎంతో ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని తుంగపాడు గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, వెంకట్‌రెడ్డి, కందుకూరి రమేష్, శరబ్‌రెడ్డి, శ్రీను ఉన్నారు.

భూనిర్వాసితులను ఆదుకుంటాం : ఆర్డీవో



చింతపల్లి: వర్కాలలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

చింతపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా నష్టపరిహారం అందించి ఆదుకుంటామని ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. మండలంలోని వర్కాలగ్రామంలోని సర్వే నంబర్ 173లో భూములు కోల్పోయిన రైతులతో కలిసి మంగళవారం ప్రత్యేకసమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ద్వారా వేల ఎకరాలకు సాగునీరు సరఫరా కావడం వల్ల పంటలు సస్యశ్యామలవుతాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణ దశలో భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రత్యేకమైన కార్యచరణ తయారు చేశామన్నారు. ఆర్‌అండ్‌బీ ద్వారా త్వరలో నిర్వాసితులకు ధ్రువపత్రాలను అందించడానికి తగిన కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఆర్ఐ సునీత, ప్రశాంత్ పాల్గొన్నారు.

చెన్నారంలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం

కొండమల్లేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే బాలు నాయక్,మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది కార్యక్రమంలో రమావత్ తులసిరాం, విశ్వనాథం, వెంకటేష్, వడ్త్య బాలు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉంచాలి



ఆందోళన చేస్తున్న యాదవ సంఘ నాయకులు

చింతపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యాశాలలో పశువుల మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం నాయకులు మంగళవారం వైద్య శాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు శివర్ల రమేష్ యాదవ్ మాట్లాడుతూ...గొర్రెలతో పాటు పశువులకు మందులు లేకపోవడం వల్ల ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి దుస్థితి ఏర్పడిందన్నారు. గొర్రెలతో పాటు, పశువులకు సకాలంలో మందులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో నేతుల సైదీశ్వర్ యాదవ్, గంగల వెంకయ్య, కడారి మల్లయ్య, చక్కని శ్రీనివాస్, కడారి యాదగిరి, గొర్రె ముత్తయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

దేవరకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లోఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనంలో మంగళవారం సన్మా నించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, బీసీ సంక్షేమసంఘం అండగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు పంగునూరి లింగయ్య, ఆమంచ అంజయ్య, రంజాన్‌బేగ్, ఎంఈవోలు వెంకటయ్య, చందునాయక్, మహేష్‌నాయక్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీసీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ

పెద్దఅడిశర్లపల్లి,మే20(ఆంధ్రజ్యోతి):దేవరకొండలో మంగళవారం నిర్వహించిన యువజన కాంగ్రెస్ సమ్మేళనానికి గుడిపల్లి మండలం నుంచి యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు.. యువజన కాంగ్రెస్ నాయకుడు జైయంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొర్ర బాలకృష్ణ, నరేందర్, వెంకట్, యాదగిరి, కిరణ్, మహేష్ తదితరులు తరలివెళ్లారు.



ర్యాలీలో పాల్గొన్న జైయంత్‌రెడ్డి, కార్యకర్తలు

దేవరకొండను ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతా



దేవరకొండలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): దేవరకొండను ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పట్టణంలోని 12, 13, 14వ వార్డుల్లో రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మునిసిపాలిటీ రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని కాలనీలకు సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. మునిసిపాలిటి పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, రహత్‌అలీ, నెమికంటి గౌరిశంకర్, ఏఈ రాజు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ

దేవరకొండ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పంపిణీ చేసి మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, గీతా కార్మికసంఘం నాయకులు లక్ష్మయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయాధికారి లక్ష్మీనర్సింహారెడ్డి (ఎల్ఎన్‌రెడ్డి)పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాల టనలో నిరుద్యోగులకు నిరాశ కలిగించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనపై దృష్టి సారించిందన్నారు. గ్రంథాలయంలో ప్రిపరేషన్‌కు వస్తున్న అభ్యర్థులకు రెండోతస్థులు సరిపోవడం లేదన్నారు. వారి భవిష్యత్‌ను కాంక్షించి మూడో అంతస్థులో భవనం నిర్మించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా తాను కాంగ్రెస్ సీనియర్ నాయకులు పైడిమర్రి నర్సింహరావు, సామాజికవేత్త డాక్టర్ జాడిరాజు సొంతఖర్చులతో మూడో ఫ్లోర్ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పైడిమర్రి నర్సింహరావు, డాక్టర్ జాడి రాజు, లయన్స్ క్లబ్ సభ్యులు, శ్రవణ్‌కుమార్, శ్యాంసుందర్ ప్రసాద్‌పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : సేవతోనే ప్రత్యేక గుర్తింపు సాధ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాధికారి లక్ష్మీనర్సింహారెడ్డి (ఎల్ఎన్‌రెడ్డి)పదవీ విరమణ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం పాఠకుల సమక్షంలో లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానించారు.

పీహెచ్‌సీ భవనం త్వరగా పూర్తి చేయాలి



పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిడమనూరులో కాలిపోయిన పీహెచ్‌సీ భవనాన్ని అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం గురించి వైద్యాధికారులు అరవింద్, రఫిలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భవనంతో పాటు ఫర్నిచర్, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ కూడా కాలిపోయిందని వైద్యులు ఆయనకు వివరించారు. ఎదురుగా ఉన్న బాలికల హాస్టల్‌లో తాత్కాలికంగా ఓపీ సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యేకు తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడి పీహెచ్‌సీకి అవసరమైన ఫరిచర్, సామగ్రి ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలోనే కొత్త పీహెచ్‌సీ భవనాన్ని ప్రాంభించడం జరుగుతుందన్నారు. అంతకుముందు మార్లగడ్డతండాలో సీతారామ ఆలయంలో జరిగిన ధ్వజస్తంభ ఏర్పాటులో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, పీసీసీ యూత్ రాష్ట్ర కార్యదర్శి యడవల్లి వల్లభ్‌రెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

తిరుమలగిరి(సాగర్), మే 20(ఆంధ్రజ్యోతి) అణగారిన వర్గాల కోసం పోరాటం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో సీపీఎం పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వీరారెడ్డి మాట్లాడారు. ప్రజలే తమ పిల్లలుగా భావించి ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం అనుముల మండల కార్యదర్శి అవుతా సైదులు, గ్రామశాఖ కార్యదర్శి బుర్రి సైదయ్య, సీనియర్ నాయకులు బుర్రి లక్ష్మయ్య, వేములకొండ పుల్లయ్య, షేక్ చాంద్‌పాషా, బుర్రి మధు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

దేవరకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ గౌరవ అధ్యక్షుడు ఫైనొద్దిన్, నాయకులు వెంకటేశ్వర్లు, రాజమల్లయ్య, పాల్గొన్నారు.

● హాలియా : లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు నాయకులు ఎస్‌కే సైదుషియన్, పాల్గొన్నారు.

● దామరచర్ల : మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పాపానాయక్, వినోద్, జహీర్, శాంతమ్మ, ఉదయ్‌కుమార్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరు

కొండమల్లేపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు మండలంలోని చెన్నమనేనిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఉద్యమాలే ఊపిరిగా సీపీఐ పార్టీ ప్రయాణం సాగుతుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సీపీఐ అని అన్నారు. ఁ సమావేశంలో గుమ్మికొండ వెంకటేశ్వర్లు, శేఖరాచారిఇ, పి.శ్రీనివాస్, కల్లు చరణ్‌రెడ్డి, కత్తుల భిక్షమయ్య, మల్లయ్య, దుర్గయ్య, సైదయ్య, చిన ఇద్దయ్య, మగమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం: మాజీ ఎమ్మెల్యే భగత్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా,మే 20(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం హాలియాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రికి అందాల పోటీ నిర్వహణ మీద ఉన్న శ్రద్ధ అన్నం పెట్టే రైతుల మీద లేదన్నారు. ప్రపంచ సుందరీమణులకు చూపించిన ప్రదేశాలన్నీ నాగార్జునసాగర్ బుద్ధవనం, యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రం, సచివాలయం, పిల్లలమర్రి అన్ని కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి చేసినవేన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రాష్ట్రం దివాలా తీసింది అంటూ మాట్లాడడం సరికాదని, మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రతిష్ఠను, ప్రజల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ మౌలిక సదుపాయాలు కల్పించిన దాఖలాలు లేవన్నారు. సాగర్ నియోజకవర్గంలో కొందరు ఆంధ్ర నుంచి ధాన్యం తీసుకువచ్చి ఐకేపీ కేంద్రాల్లో పోసి కోట్ల రూపాయాలు కాజేస్తున్నారని ఆరోపించారు.సాగర్ జలాశయం నుంచి ఆంధ్ర రాష్ట్రం వాళ్లు నీటిని అక్రమంగా తరలించకపోతున్న ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ప్రతి రోజు ప్రజలు క్షోభ పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, నాగులవంచ తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, కామాల జానయ్య, పామోజు వెంకటాచారి, వెంకటేశ్వర్లు, పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన ఉండాలి

మిర్యాలగూడ, కొండమల్లేపల్లి, పెద్దవూర, వేములపల్లి, చింతపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఆధునిక బోధన పద్ధతులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ కె.నరసింహ అన్నారు. మిర్యాలగూడ, వేముపల్లి మండలకేంద్రాల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణలో పాల్గొని మాట్లాడారు. అలాగే కొండమల్లేపల్లి, పెద్దవూర, చింతపల్లి మండలకేంద్రాల్లో ఆయా మండలాల ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠ్య పుస్తకాలతోపాటు డిజిటల్ బోధన కృత్రిమ మేధా ఉపయోగాలపై కూడా శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమాల్లో కొండమల్లేపల్లి, పెద్దవూర, చింతపల్లి ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, తరి రాము, అంజయ్య పాల్గొని అవగాహన కల్పించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.